

ఉష్ణోగ్రతలు
గరిష్ఠం కనిష్ఠం 44.0 29.0



తోపుదుర్తిలో టీడీపీ నాయకుడు వన్నూరప్ప ఇంట్లోకి చొరబడిన రాజారెడ్డి అనుచరులు

"కొడకల్లారా.. టీడీపీ వాళ్లు కనిపిస్తే నరికేస్తాం..! ఉంటే వైసీపీలో ఉండండి. లేదంటే ఊరు విడిచి వెళ్లండి..! పరిటాల వాళ్లు ఇక్కడికి ఎలా వస్తారు..?" ఇదీ.. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సోదరుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి వార్నింగ్..! తమ స్వగ్రామం తోపుదుర్తిలో అనుచరులతో కలిసి ఆయన భయానకవాతావరణాన్ని సృష్టించారు. ఎన్నికల సమయంలో ఈ స్థాయిలో దౌర్జన్యాలు సాగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదు. కోడ్ అమలులోకి వచ్చినా.. ఇంకా అధికార పార్టీ సేవలోనే తరిస్తున్నారని టీడీపీ నాయకులు మండిపడుతున్నారు.



తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి (ఫైల్)

కొడకల్లారా.. నరికేస్తాం!

ఉంటే వైసీపీలో ఉండండి.. లేదంటే ఊరు విడిచి వెళ్లిపోండి..

టీడీపీ నాయకులకు ఎమ్మెల్యే సోదరుడి వార్నింగ్
ఇళ్లలోకి చొరబడి టీడీపీ నాయకులపై దాడులు

స్వగ్రామం తోపుదుర్తిలో రాజశేఖర్ రెడ్డి హల్‌చల్



ఒంటిపై గాయాలను చూపుతున్న బాధితుడు వన్నూరప్ప

ఆత్మకూరు, ఏప్రిల్ 28: రాప్తాడు నియోజకవర్గంలో వైసీపీ సిటింగ్ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరుడు రాజారెడ్డి అరాచకాలు, దౌర్జన్యాలు కొనసాగుతున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ టీడీపీ వర్గీయులపై విరుచుకుపడుతున్నారు. తన అనుచరులతో కలిసి వైరిపక్షం ఇళ్లపైకి దండెత్తుతున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా అధికార పార్టీ వారి రాజ్యమే నడుస్తోంది. పోలీసులు ఏమాత్రం పట్టించుకోకపోవడం దీనికి నిదర్శనం. రామగిరి మండలం పీఆర్ కొట్టాలలో మాదాపురం ఎంపీటీసీ సంపత్‌పై శనివారం పట్టపగలు దాడి చేశారు. ఇంట్లోకి చొరబడి అతనిపై, కుటుంబ సభ్యులపై దాడి చేశారు. అడ్డుకున్న స్థానిక దళిత మహిళ లక్ష్మక్కను జుట్టుపట్టి ఈడ్చికొట్టారు. మరొకరిపై కట్టెలతో దాడి చేశారు. సంపత్‌ను కిడ్నాప్ చేసి ఎమ్మెల్యే వద్దకు తీసుకువెళ్లారు. బలవంతంగా వైసీపీ కండువాను వేయించారు. ఆ తరువాత అర్ధరాత్రి ఆత్మకూరు మండలం తోపుదుర్తిలో మరింత అరాచకానికి పాల్పడ్డారు. గ్రామంలో భయానక వాతావరణాన్ని సృష్టించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా వారి ఇళ్లలోకి చొరబడి దాడులకు పాల్పడ్డారు.

అర్ధరాత్రి దాడులు

తోపుదుర్తి గ్రామంలోని టీడీపీ దళిత నాయకుడు వన్నూరప్ప ఇంట్లోకి రాజారెడ్డి అనుచరులు శనివారం అర్ధరాత్రి చొరబడి తీవ్రస్థాయిలో బెదిరించారు. వైసీపీలో చేరాలని, లేకపోతే చంపేస్తామని హెచ్చరించారు. వన్నూరప్ప నిరాకరించడంతో దాడికి దిగారు. పిడిగుద్దులు గుద్దుతూ గ్రామంలో ఉన్న ఎమ్మెల్యే ఇంటివద్దకు తీసుకెళ్లారు. 'ఉంటే వైసీపీలో ఉండు.. లేదంటే మరో 13 రోజుల్లో నిన్న చంపుతాం' అని బెదిరించారు. ఆ తర్వాత టీడీపీ బీసీ నాయకుడు బోయ లింగమయ్య ఇంటిదగ్గరకు రాజారెడ్డి అనుచరులు వెళ్లారు. 'అన్న పిలుస్తున్నాడు.. రా..' అని పిలిచారు. ఆ ఇంటివద్ద హల్‌చల్ చేశారు. తాను రానని లింగమయ్య స్పష్టం చేయడంతో విషయం రాజారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆవేశంతో ఊగిపోతూ వచ్చిన రాజారెడ్డి.. లింగమయ్య ఇంట్లోకి చొరబడ్డాడు. 'ఉంటే వైసీపీలో ఉండాలి.. లేదంటే ఊరు విడిచిపెట్టి వెళ్లాలి. పార్టీలో చేరకపోతే నరికిపారేస్తాం..' అని బెదిరించాడు. ఇదే సమయంలో మద్యం మత్తులో ఉన్న పలువురు వైసీపీ కార్యకర్తలు ఆ ఇంటిని చుట్టుముట్టారు. లింగమయ్య కుటుంబ సభ్యులు వారిని ప్రతిఘటించే ప్రయత్నం చేశారు.

పోలీసులు ఏం చేస్తున్నట్లు..?

అర్ధరాత్రి ఎమ్మెల్యే సోదరుడి ఆరాచకంతో గ్రామస్థులు బెంబేలెత్తిపోయారు. దౌర్జన్యకాండ జరుగుతున్నంత సేపు ఇళ్ల నుంచి గ్రామస్థులు ఎవరూ బయటకు రాలేదు. ఎమ్మెల్యే సోదరుడు టీడీపీ నాయకుల ఇళ్లపై చొరబడి దాడులు, బెదిరింపులకు తెగబడుతున్నా పోలీసుల నుంచి ఎలాంటి స్పందన కనిపించలేదు. పోలీసులకు సమాచారం అందించినా దొంగలుపడిన ఆరు నెలలకు కుక్కలు మొరిగిన చందంగా నింపాదిగా ఆదివారం ఉదయం ఎస్‌ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు ఆ గ్రామానికి వచ్చి.. తిరిగి వెళ్లిపోయారు. గ్రామంలో పోలీసు పికెట్ ఉన్నా.. అర్ధరాత్రి దాడులు జరుగుతున్న సమయంలో స్పందించలేదు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా, పోలీసులు అధికార పార్టీ నేతలు కనుసన్నల్లోనే పనిచేస్తున్నారు.

ఎమ్మెల్యే సోదరుల నుంచి ప్రాణహాని

వన్నూరప్ప



రాప్తాడు ఎమ్మెల్యే సోదరుల నుంచి తనకు ప్రాణహాని ఉందని తోపుదుర్తి గ్రామానికి చెందిన టీడీపీ దళిత నాయకుడు వన్నూరప్ప ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సోదరుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి అనుచరులు అర్ధరాత్రి తమ ఇంట్లోకి చొరబడి దాడి చేశారని వాపోయారు. తనను బలవంతంగా ఎమ్మెల్యే ఇంటివద్దకు తీసుకెళ్లారని, ఉమారెడ్డి అనేవ్యక్తి మద్యం సేవించి దుర్భాషలాడారని ఆవేదన వ్యక్తం చేశారు. 'నా కొడకా చంపుతాం.. టీడీపీ నా కొడుకులు ఊళ్లో కనబడకూడదు. పరిటాల వాళ్లు ఎలా వస్తారు..?' అని రాజశేఖర్ రెడ్డి బెదిరించారని అన్నారు. తనకు రక్షణ కల్పించాలని పోలీసులకు విన్నవించారు.

జిల్లా నుంచి బహిష్కరించండి

మాజీ మంత్రి పరిటాల సునీత

రామగిరి/అనంతపురం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరుడు రాజశేఖర్‌రెడ్డి దౌర్జన్యకాండకు హద్దులేకుండా పోయిందని మాజీ మంత్రి పరిటాల సునీత మండిపడ్డారు. ఆయనను జిల్లా నుంచి బహిష్కరించాలని పోలీసులను డిమాండ్ చేశారు. స్వగ్రామం వెంకటాపురం, అనంతపురం నగరంలోని ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పీఆర్ కొట్టాల, తోపుదుర్తిలో జరిగిన ఘటనలపై ఆమె స్పందించారు. ఎమ్మెల్యే సోదరుడి వరుస దాడులపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని అన్నారు. ఎమ్మెల్యే స్వగ్రామం తోపుదుర్తిలో ఎస్సీలు, వాల్మీకులు టీడీపీలోకి చేరారనే అక్కసుతో అర్ధరాత్రి దాడులకు తెగబడ్డారని అన్నారు. తోపుదుర్తిలో బోయ లింగమయ్యను బెదిరించారని, దాడికి ప్రయత్నించడంతో బంధువులు ప్రతిఘటించారని తెలిపారు. ఎమ్మెల్యే సోదరుడు గన్‌మెన్‌తో పాటు 30 మందికిపైగా అనుచరులతో దాడులకు దిగారని, దుర్భాషలాడుతూ, చంపుతామని బెదిరించారని అన్నారు. ఈ అరాచకాన్ని ఓ వ్యక్తి చిత్రీకరిస్తుండగా, అతనిపై దాడి చేసి సెల్‌ఫోన్ లాగేసుకున్నారని అన్నారు. వన్నూరప్ప ఇంటిపైకి 30 మంది వెళ్లారని, వన్నూరప్పతో పాటు అతని కుటుంబసభ్యులను ఎమ్మెల్యే ఇంటి వద్దకు లాక్కువెళ్లారని అన్నారు. ఎమ్మెల్యే అనుచరుడు కుమార్‌రెడ్డి వన్నూరప్పపై దాడిచేసి, రాజారెడ్డి కాళ్లు పట్టుకొని క్షమించమని వేడుకోవాలని బెదిరించాడని అన్నారు. చివరికి అతని తల్లి రాజారెడ్డి కాళ్ల మీద పడి వేడుకోగా.. వదిలేశారంటే.. ఎమ్మెల్యే సోదరుడి దౌర్జన్యాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవాలని ప్రజలను కోరారు. ఈ ఘటనలపై సీఐ, ఎస్‌ఐకి ఫోన్ ద్వారా సమాచారమిచ్చినా సరిగా స్పందించలేదని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన గన్‌మెన్‌ను దాడులకు, బెదిరింపులకు వినియోగిస్తున్నారని, ఇలా అయితే ఎన్నికలు ఎలా సజావుగా సాగుతాయని ప్రశ్నించారు. లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు చెప్పడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. ప్రతిరోజూ 200 మందికిపైగా వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్నారని, దీన్ని జీర్ణించుకోలేకే దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేతనైతే వలసలు ఆపుకోవాలని, దాడులు చేయడం ఏమిటని మండిపడ్డారు.



మీడియాతో మాట్లాడుతున్న పరిటాల సునీత

ఐకియా.. మోసపోయా..!

రూ.2 కోట్లకు ఆన్‌లైన్ యాప్ టోపీ

పాత చైన్ లింక్ పద్ధతిలో భారీ వసూళ్లు
రూ.లక్షకు 12 రోజుల్లో రూ.3 లక్షలు ఇస్తామని..
ఫర్నిచర్ వ్యాపారం పేరిట పరిచయమై.. బురిడీ



ఐకియా యాప్‌లో వ్యాపార పట్టిక

రాయదుర్గం, ఏప్రిల్ 28: ఆన్‌లైన్ ద్వారా సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆశతో నిలువునా మోసపోయారు. ఉన్న డబ్బును మోసగాళ్ల చేతిలో పెట్టి నిండా మునిగారు. తొలుత నమ్మకం కలిగేలా వ్యవహారాన్ని నడిపిన ఆన్‌లైన్ యాప్ నిర్వాహకులు.. నమ్మకం బలపడ్డాక పెద్ద ఎత్తున సొమ్ము పోగుచేసుకుని మాయమయ్యారు. రాయదుర్గం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల ప్రజలు సుమారు రూ.2 కోట్ల దాకా మోసపోయారు. ఐకియా పేరిట ఓ యాప్ 2023 డిసెంబరులో రాయదుర్గం నియోజకవర్గంలో పరిచయమైంది. చవక ధరలకు ఫర్నిచర్ వ్యాపారాన్ని యాప్ ద్వారా ప్రారంభించారు. ధర రూ.625 మొదలై.. రూ.లక్షల వరకు చూపించారు. సభ్యులు తమ శక్తి మేరకు సొమ్ము చెల్లించి ఫర్నిచర్ కొనాలి. సభ్యులను చేర్పించాలి. ఉదాహరణకు.. రూ.625 చెల్లించి ఒక వస్తువు కొంటే 45 రోజులకు రూ.1800 యాప్ నిర్వాహకులు చెల్లిస్తారు. సభ్యులను చేర్చేకొద్దీ ఆదాయాన్ని పెంచుతూపోతారు. పాత పద్ధతిలోనే ఆన్‌లైన్‌లో చైన్‌లింక్‌ను ప్రయోగించారు. మొదట్లో చాలామందికి ఆదాయాన్ని రుచి చూపించారు. దీంతో ఆశపడిన చాలామంది నిరుద్యోగులు పల్లెలకు సైతం విస్తరించారు. తమకింద సభ్యులను చేర్చుకుంటూ వచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా 400 మంది దాకా సభ్యులు ఉన్నట్లు సమాచారం. డిసెంబరు నుంచి యాప్‌లో పెట్టుబడి పెడుతూ వచ్చిన వారందరికీ లాభాలు ఇస్తూ వచ్చారు. నమ్మకం బలపడిందని తేలా.. 20 రోజుల క్రితం యాప్ నిర్వాహకులు పెద్ద ఎత్తున సొమ్ము పోగేసుకునే వ్యూహాన్ని అమలు చేశారు. చెల్లింపుల గడువును 45 రోజుల నుంచి 12 రోజులకు కుదించారు. రూ.లక్ష చెల్లిస్తే.. 12 రోజుల్లో రూ.3 లక్షలు చెల్లిస్తామని ఊరించారు. దీంతో ఆశపడిన చాలామంది లక్షల్లో పెట్టారు. వీరిలో యువత, మహిళలు, ఉద్యోగులు, వ్యాపారులు ఉన్నారు. కొందరు బంగారం, ఆస్తులు తాకట్టు పెట్టి మరీ యాప్‌లో పెట్టుబడి పెట్టారు. 12 రోజుల్లో సొమ్ము వెనక్కు వస్తుందని ఎదురుచూశారు. కానీ డబ్బులు తిరిగిరాకపోగా.. యాప్ స్తంభించింది. ఈ నెల 23వ తేదీ నుంచి లింక్ ఓపెన్ కాలేదు. దీంతో సొమ్ము చెల్లించినవారు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఇప్పటిదాకా పోలీసులకు ఎవరూ ఫిర్యాదు చేయలేదు.

ఉద్యోగులే ఎక్కువ..

ఆన్‌లైన్ యాప్‌లో పెట్టుబడి పెట్టి మోసపోయినవారిలో ప్రభుత్వ ఉద్యోగులు ఎక్కువగా ఉండడం కొసమెరుపు. సాధారణంగా ఇటువంటి వ్యవహారాల్లో మోసపోతే పోలీసులను ఆశ్రయిస్తాం. కానీ ఇక్కడ కొందరు పోలీసులు కూడా అత్యాశకుపోయి మోసపోయినట్లు తెలిసింది. ఒక్కొక్కరు రూ.5 లక్షలకుపైగా చెల్లించినట్లు విశ్వసనీయ సమాచారం. రాయదుర్గంలో ఓ వైద్యుడు రూ.20 లక్షలు మోసపోయినట్లు తెలిసింది. రాయదుర్గం మండలంలోని కాశీపురం, రాతిబావివంక, రాయదుర్గం పట్టణంలోని కోతిగుట్ట ప్రాంతాలలో సుమారు రూ.కోటి దాకా మోసపోయారని తెలిసింది. కొంత మంది విద్యార్థులు కూడా బాధితుల జాబితాలో ఉన్నారు. డబ్బుల కోసం యాప్‌ను పరిచయం చేసిన వారితో పాటు సభ్యులుగా చేర్పించిన వారితోనూ కొందరు గొడవపడుతున్నారు.

బుకాయింపులు.. అబద్ధాలు..

చప్పగా సీఎం సభ

• మేనిఫెస్టో ప్రస్తావనే లేదు • తాడిపత్రి ప్రచార సభకు స్పందన కరువు

సభలో మాట్లాడుతున్న జగన్



తాడిపత్రి టౌన్, ఏప్రిల్ 28: ఎన్నికల ప్రచారంలో సీఎం జగన్ 'పేలవ ప్రదర్శన' కొనసాగుతోంది. వైసీపీని మరోసారి అధికారంలోకి తీసుకువస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, టీడీపీ అధికారంలోకి వస్తే ఆగిపోతాయని జనాన్ని బెదిరించి, లబ్ధి పొందేందుకు ప్రయత్నించారు. తాడిపత్రి వైఎస్సార్ సర్కిల్‌లో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చామని అన్నారు. నవరత్నాల్లోని అన్ని పథకాలను అమలు చేశామని అన్నారు. కానీ ప్రత్యేక హోదా, మద్యపాన నిషేధం, పోలవరం ప్రాజెక్ట్, సీపీఎస్ రద్దు, మెగా డీఎస్సీ తదితర అంశాల గురించి ప్రస్తావించలేదు. వీటన్నింటినీ విస్మరించి.. 99 శాతం నెరవేర్చామని ఎలా చెబుతారని బహిరంగ సభకు వచ్చిన జనం నిట్టూర్చారు. 'నా ఎస్సీ నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ' అంటూ.. పదవులు, టిక్కెట్ల విషయంలో వారికి అధిక ప్రాధాన్యం ఇచ్చామని బురిడీ కొట్టించేందుకు చూశారు. 2014 నాటి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాన్ని ప్రజలకు చూపుతూ.. ఆ హామీల అమలు చంద్రబాబు విఫలమయ్యారని ఆరోపించారు. చంద్రబాబును నమ్మితే చంద్రముఖిని నిద్రలేపినట్లేనని, ఆయనతో పెట్టుకుంటే రక్తం తాగే పశుపతితో పెట్టుకున్నట్లేనని అక్కసు వెళ్లగక్కారు. తనకు కుట్రలు, కుతంత్రాలు తెలియవని అన్నారు. టీడీపీ కూటమి మొత్తం కుర్చీ ఎక్కేందుకు కుట్రలు చేస్తోందని విమర్శించారు. తాను చేసిన అభివృద్ధిలో సగమైనా గతంలో చంద్రబాబు చేశారా అని ప్రశ్నించారు. కూటమిలో భాగమైన బీజేపీ గురించి, ప్రధాని మోదీ గురించి ప్రస్తావించకుండా.. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లపై మాత్రమే విమర్శలు గుప్పించారు.



వెనుదిరిగిన జనం..

వైసీపీ ఎన్నికల మేనిఫెస్టో గురించి తాడిపత్రి సభలో సీఎం జగన్ ఏమాత్రం పస్తావించలేదు. మేనిఫెస్టోలో ఉన్న ఒక్క అంశం గురించీ మాట్లాడలేదు. వైసీపీ మేనిఫెస్టోలో ఏమి లేదని సోషల్ మీడియాలో విమర్శలు రావడంతో ఆయన మౌనం వహించినట్లు కనిపిస్తోంది. జగన్ ప్రసంగంలో విశేషాలు ఏమీ లేకపోవడంతో జనం మధ్యలోనే వెనుదిరిగారు. జగన్ వచ్చాక కాసేపటికే ఇంటిదారి పట్టారు. జగన్ రాక సుమారు గంటన్నర ఆలస్యం కావడంతో ఎండ వేడిమికి చాలామంది ఇబ్బందిపడ్డారు. మరోవైపు సీబీ రోడ్డులో దుకాణాలన్నీ మూతపడటంతో పట్టణవాసులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పోలీస్‌స్టేషన్ ఎదుటే వైసీపీ కార్యకర్తలు మద్యం తాగుతూ చిందులు వేశారు.



షాపు ముందు మద్యం తాగుతున్న కార్యకర్తలు

చుక్క.. ముక్క.. లెక్క..!

యాడికి: సీఎం సభకు వస్తే మహిళలకు రూ.300, పురుషులకు క్వార్టర్ మద్యం, మాంసాహార భోజనం.. అంటూ వైసీపీ నాయకులు ప్రలోభ పెట్టారు. వేములపాడు నుంచి వైసీపీ చోటా నాయకులు సీఎం సభకు జనాన్ని తరలించేందుకు డబ్బు, మద్యం, మాంసాహారాన్ని ఎరగా వేశారు. ఒక్కో గ్రామం నుంచి వంద మందిని సభకు తీసుకురావాలని గ్రామస్థాయి నాయకులను పురమాయించారు. ఒక్కో చోటా నాయకుడి చేతికి రూ.50వేలు ఇచ్చారని సమాచారం.

పోలీసుల అత్యుత్సాహం

సీఎం బహిరంగ సభకు బందోబస్తుగా వచ్చిన పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ప్రొటోకాల్ పేరిట కొందరు వైసీపీ నాయకులతోపాటు మీడియా సిబ్బందిని అడ్డుకున్నారు. మీడియాకు గ్యాలరీ లేదని ఏఎస్‌ఐ స్థాయి పోలీసు అధికారులు విలేకరులపై చిందులు వేశారు. భద్రత పేరుతో వాహనదారులను ఇబ్బందులకు గురిచేశారు. వచ్చినదారినే వెళ్లాలని సందుల్లోకి ట్రాఫిక్‌ను మళ్లించారు.



ఇంటిముఖం పట్టిన ఫయాజ్‌బాషా

పాపం.. పైలా.. ఫయాజ్..

జగన్ బహిరంగ సభలో స్థానిక వైసీపీ నాయకులకు భంగపాటు తప్పలేదు. జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులను సైతం గ్యాలరీలోకి అనుమతించలేదు. మైనార్టీ రాష్ట్ర నాయకుడు ఫయాజ్‌బాషా గ్యాలరీలోకి వెళుతుండగా సీఎం సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. జాబితాలో పేరు లేదనని, వెళ్లిపోవాలని చెప్పడంతో ఫయాజ్‌బాషా కొందరు నాయకులకు ఫోన్లు చేసి సిబ్బందితో మాట్లాడించే ప్రయత్నం చేశారు. అయినా సీఎం సెక్యూరిటీ సిబ్బంది ఒప్పుకోలేదు. దీంతో ఆయన తన అనుచరవర్గంతో ఇంటిముఖం పట్టారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య సీఎం బస్సు ఎక్కేందుకు వెళుతుండగా సీఎం సెక్యూరిటీ అడ్డుకుంది. ఆయన పేరు కూడా జాబితాలో లేదని చెప్పడంతో అవాక్కయ్యారు.

ముగ్గురు వలంటీర్లపై వేటు




అనంతపురం టౌన్, ఏప్రిల్ 28: ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ముగ్గురు వలంటీర్లపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదివారం వేటు వేశారు. రాయదుర్గం నియోజకవర్గంలోని కణేకల్లు మండలం హాళికెర గ్రామ వలంటీరు ఎస్.సురేష్, డీ.హీరేహాళ్ మండలం సోమలాపురం గ్రామ వలంటీరు చైత్ర, బొమ్మనహాళ్ మండలం కొలగనహళ్లి గ్రామ వలంటీరు వడ్డే భాస్కర్‌ను విధుల నుంచి తొలగించారు. వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొన్నందుకు వీరిపై చర్యలు తీసుకున్నారు. ఇప్పటి వరకు కోడ్ ఉల్లంఘనల కారణంగా 84 మంది వలంటీర్లు, 13 మంది డీలర్లు, ఆపరేటర్లు, 30 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఆరుగురు రెగ్యులర్ ఉద్యోగులపై చర్యలు తీసుకున్నామని కలెక్టర్ ప్రకటించారు.



సబ్‌స్టేషన్‌లో చెలరేగిన మంటలు

పేలిన ట్రాన్స్‌ఫార్మర్

గుత్తి, ఏప్రిల్ 28: పట్టణంలోని 220 కేవీ సబ్‌స్టేషన్‌లో ఆదివారం రాత్రి పొటెన్షియల్ ట్రాన్స్‌ఫార్మర్ పేలి భారీగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన అధికారులు, సిబ్బంది వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేసి మంటలను అదుపులోకి తెచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో గుత్తి, గుంతకల్లు, ఉరవకొండ, కర్నూలు జిల్లా పత్తికొండ, ఆదోని తదితర ప్రాంతాల్లో దాదాపు మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులు అల్లాడిపోయారు. అధికారులు యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. రాత్రి పది గంటల సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.



బుల్లెట్టు బండెక్కి..



ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ బుల్లెట్ నడిపారు. మండలంలోని బూదగవి గ్రామంలో ఆదివారం ఎన్నిక ప్రచారంలో పాల్గొనేందుకు ఆయన వచ్చారు. ఈ సందర్భంగా బుల్లెట్ నడిపి కార్యకర్తలు, నాయకులలో జోష్ నింపారు.

- ఉరవకొండ

అభిమానం ఆకాశం ఎత్తున ..!



ఆ నాయకులపై ప్రజాభిమానం ఆకాశం ఎత్తు నుంచి పూల వర్షం కురిపించింది. తమ అభిమాన నాయకులు ఊరికి వస్తున్నారనే సమాచారంతో ఆ గ్రామ కార్యకర్తలు ఎక్స్‌కవేటర్‌పై నిలబడి పూల వర్షం కురిపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుండుమల తిప్పేస్వామి అగళి మండలం పి.బ్యాడికెర గ్రామం వెళ్లారు. ఆ సందర్భంగా అగళి జడ్పీటీసీ ఉమేష్, పార్టీ మండల కన్వీనర్ కుమార్‌స్వామి ఆధ్వర్యంలో టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు ఎక్స్‌కవేటర్ ఎక్కి పూలవర్షం కురిపించారు.

- అగళి

భయపడకు తల్లీ.. గెలుపునీదే !




ఏం దిగులు వద్దు తల్లీ. నీ గెలుపు గ్యారెంటీ అన్నట్లు ఓ వృద్ధుడు శింగనమల టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీని ఆశీర్వదించాడు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె గార్లదిన్నె మండలం పెనకచెర్ల గ్రామంలో పర్యటించారు. ఆ సందర్భంగా వృద్ధులను పలుకరిస్తూ టీడీపీ ప్రకటించిన పథకాలు వివరిస్తూ ముందుకు సాగారు. ఈక్రమంలోనే ఓ వృద్ధుడు ఆమె తలపై చేయిపెట్టి ఆశీర్వదించారు.

- గార్లదిన్నె

ఫినిష్ ఆంధ్ర..!

ఫిష్ ఆంధ్రా పేరుతో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి మత్స్యకారులకు వల విసిరారు. షాపులు తెరుచుకోండి.. సముద్రజాతుల చేపలు తక్కువ ధరలకే సరఫరా చేస్తామని, అధిక లాభాలు పొందవచ్చని అధికారులు ఆశ చూపారు. వారి మాటలను నమ్మిన పలువురు ఔత్సాహికులు సుమారు 50 ఫిష్ ఆంధ్ర షాపులను తెరిచారు. వారు చెప్పిన విధంగా సముద్ర జాతుల చేపలను సరఫరా చేయలేదు. స్థానికంగా లభించే వాటినే బయటికంటే అధిక ధరలకు సరఫరా చేశారు. ఔత్సాహికుల ఆశలపై నీళ్లు చల్లారు. విధిలేక వారు ఆ షాపులను మూసేశారు.



ఫిష్ ఆంధ్రా షాపులో నిరుపయోగంగా ఉన్న సామగ్రి

ఆక్వా హబ్ అట్టర్‌ఫ్లాప్

ఉత్తుత్తి మాటలుగా సీఎం జగన్ హామీ

హార్బర్ తరహాలో వ్యాపారాలంటూ మోసం

తక్కువ ధరలకే సముద్రజాతుల చేపలంటూ మత్స్యకారులకు వల

వ్యాపారాల్లేక ఫిష్ ఆంధ్రా షాపుల మూత

అనంతపురం ప్రెస్‌క్లబ్

'మత్స్యకారుల అభివృద్ధే తమ ధ్యేయం... వారికి మత్స్య సంపదను అందిస్తాం... అందులో భాగంగా జిల్లాకో ఆక్వా హబ్ ఏర్పాటు చేస్తాం' అని ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి 2020 నవంబరు 21న మత్స్యకార దినోత్సవం సందర్భంగా హామీ ఇచ్చారు. ఆ మాటలు నమ్మిన మత్స్యకారులు సంబరపడిపోయారు. తీరా చూస్తే అవి ఒట్టిమాటలేనని తేలడంతో ఆ వర్గాలకు నిట్టూర్పు తప్పలేదు. రూ. కోటితో ఆక్వా హబ్‌ను ఎలా నిర్మించాలనుకున్నారో అంతుచిక్కని ప్రశ్నగా మారింది. సముద్రతీర ప్రాంతాల సమీపంలో ఉండే ఆక్వా హబ్‌లు ఏర్పాటు చేయాలంటే దాదాపు రూ. 4 కోట్ల వరకూ ఖర్చవుతున్నట్లు సమాచారం. ఆక్వా హబ్ ఏర్పాటుకు అంచనాలు, ఖర్చు ఇవన్నీ తెలిసి ప్రభుత్వం ప్రకటించిందా...? లేదా గొప్పలు పోవడానికి ఆక్వా హబ్‌ను ప్రకటించిందా.. అన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ఆక్వా హబ్ నిర్వీర్యమిలా..

జిల్లాలో ఆక్వా హబ్ ఏర్పాటు కావాలంటే దానికి అనుసంధానంగా 178 మినీ ఫిష్ వెండింగ్ యూనిట్లు ఉండాలి. ఆ తరహాలో యూనిట్లు ఏర్పాటైతేనే హబ్ నడిపే వెసులుబాటు ఉంటుంది. అప్పుడే హబ్‌లో పలు రకాల సముద్రజాతుల చేపలను నిల్వ చేసుకొని యూనిట్లకు సరఫరా చేయవచ్చు. ఇవన్నీ అసాధ్యమని తెలిసినప్పటికీ గొప్పలు పోయారు. జిల్లాలో హబ్ ఏర్పాటుకు రూ. కోటితో అంచనా వేసిన ప్రభుత్వం చేతులు దులుపుకుంది. హబ్ ఏర్పాటు కావాలంటే సుమారు ఆరేడు కోట్లు అవుతున్నట్లు అధికారిక లెక్కల ద్వారా తెలుస్తోంది. నాలుగేళ్లుగా ఎంతోమంది పారిశ్రామికవేత్తలను ఆహ్వానించినా.. ప్రభుత్వం ఇచ్చే డబ్బుతో ఏర్పాటు చేయలేమని వెనక్కు వెళ్లిపోయారు. హబ్ ఏర్పాటుకు ఓ ప్రముఖ సంస్థ ముందుకొచ్చినప్పటికీ.. 178 యూనిట్లలో కనీసం 50 మినీ ఫిష్ వెండింగ్ యూనిట్లనైనా ఏర్పాటు చేయాలని మెలికపెట్టారు. నాలుగేళ్లుగా అధికారులు ఎంత ప్రయత్నించినప్పటికి 50 ఫిష్ ఆంధ్రా షాపులను ప్రారంభించగలిగారు. అవికూడా మత్స్య సహకార సంఘాల్లో ఉన్న వారితోనే తెరిపించినట్లు ఆ శాఖ వర్గాల ద్వారా అందిన సమాచారం. ఆ షాపులకు హబ్ ప్రమోటర్లు అందించే చేపలు అధిక ధరలు ఉండటంతో... విక్రయించలేక దాదాపు 30కిపైగా దుకాణాలను మూసేశారు. మరికొందరు అవే షాపుల్లో చికెన్‌సెంటర్లు, మటన్ సెంటర్లు నిర్వహించుకుంటున్నారు. దీంతో ఆ ప్రముఖ సంస్థ హబ్ నుంచి తప్పుకుంది. ఇలా జిల్లాలో ఆటంకాల మధ్య ఆక్వా హబ్ నిర్వీర్యమైపోయింది.



ఫిష్ ఆంధ్రాతో నష్టపోయిన మత్స్యకారులు

'రోడ్డు పక్కన వ్యాపారం వద్దు.. నాణ్యమైన చేపల మాంసాన్ని అమ్ముదాం. వినియోగదారులను మనవైపు తిప్పుకుందాం.. లాభాలు గడిద్దాం' అని మత్స్యశాఖ అధికారులు జిల్లాలోని పలువురు మత్స్యకారులు, ఔత్సాహికులతో బలవంతంగా షాపులను తెరిపించారు. రూ. 30 వేలు పెట్టుబడి పెట్టండి... షాపు చూపించండి... అంతా మేము ఏర్పాటు చేస్తాం.. బయటి మార్కెట్లో కన్నా.. కిలో చేపలపై రూ. 10 తగ్గింపుతో ఇస్తాం.. అని చెప్పి నగరంలో ఫిష్ ఆంధ్రా పేరుతో చేపల యూనిట్లను ఏర్పాటు చేశారు. లాభాలొస్తాయని కొందరు మత్స్యకారులు, ఔత్సాహికులు ఆశపడి రూ. 30వేలు చెల్లించి మరీ షాపులను తెరిచారు. పట్టుమని నెలరోజులు కూడా వారు చెప్పిన మాట మేరకు చేపలను ఇవ్వలేకపోయారు. తక్కువ ధరలు అటుంచితే.. కనీసం తాము కోరిన రకం చేపలైనా ఇవ్వండయ్యా వ్యాపారాలు చేసుకుంటామన్నా అధికారులు పట్టించుకోలేదు. దీంతో మత్స్యకారులు, ఔత్సాహికులు ఫిష్ ఆంధ్రా షాపులను మూసేశారు.

నట్టేట ముంచారు

నేను చేపలు పట్టుకొని బళ్లారి బైపాస్, కళ్యాణదుర్గం బైపాస్ రోడ్లలో అమ్ముకునేవాడిని. మార్కెట్లో చేపలు కొనుక్కొచ్చి వ్యాపారం చేసుకునేడివాడిని. కిలో రూ. 100లు పడేవి. ఫిష్ ఆంధ్రా షాపుల్లో రకరకాల చేపలు వస్తాయి.. జనాలు బాగా వస్తారు.. వ్యాపారాలు బాగా అవుతాయి అంటే రూ. 30 వేలు కట్టాను. షాపులో అయితే అన్ని చూసేకి బాగానే ఉన్నాయిగానీ... వాళ్లు చెప్పినట్లు మాకేమీ సముద్రంలో లభించే చేపలు వేయలేదు. మామూలు మార్కెట్లో లభించే కట్లా, రోహు, జిలేబీలే ఇచ్చారు. అవి కూడా కిలో రూ. 120తే ఇచ్చారు. ఆ రేట్లతో చేపల అమ్ముడుపోక షాపును మూసేశాను. షాపు ముందరే బయట రోడ్డు మీద చేపల పెట్టుకొని అమ్ముకుంటున్నాను. ఏం చేస్తాం లాభాలంటూ షాపులు పెట్టిచ్చి నట్టేట ముంచారు.


- ఓ నిర్వాహకుడి ఆవేదన

చెలామణీ మారింది



కనుమరుగైన పెద్దనోట్లు.. రూ.500దే హవా

హిందూపురం/రాయదుర్గం, ఏప్రిల్ 28: కొన్నేళ్ల కిందట ఎన్నికలంటే హామీలు, వాగ్దానాలు మాత్రమే ఉండేవి. మారిన పరిస్థితుల్లో ఎన్నికలను డబ్బు, మద్యం ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికలు వచ్చాయంటే కొన్ని ప్రాంతాల్లో మద్యం ఏరులైపారుతుంది. డబ్బు పంపిణీ కూడా విచ్చలవిడిగా జరుగుతోంది. పెద్దనోట్ల రద్దుతో ప్రస్తుత ఎన్నికల్లో రూ.500 నోట్ల హవా నడవనుంది. వద్దు వద్దంటూనే ఓటుకు నోటు తీసుకోవడం కొందరు ఓటర్లకు అలవాటుగా మారింది. అభ్యర్థిలో మంచి గుణాలకన్నా, శ్రీమంతుడైతే ఓట్లు కొంటాడని, ఎక్కువ మొత్తం ఇస్తాడని ఆశిస్తుంటారు. 2014లో ఎన్నికలు జరిగిన సమయంలో రూ.వెయ్యి నోటు అందుబాటులో ఉంది. దీంతో ఆ నోట్ల కట్టలు తరలించేందుకు, పంచేందుకు కొందరు అభ్యర్థులు పెద్దగా ఇబ్బంది పడలేదు. ఆ తర్వాత రెండేళ్లకే ఆనోటును రద్దు చేశారు. అయితే 2019 ఎన్నికల సమయంలో రెండు వేల రూపాయల నోటు అందుబాటులో ఉండటం అభ్యర్థులకు బాగా కలిసివచ్చింది. అభ్యర్థుల అనుచరులు సులభంగా డబ్బును తరలించడంతో పాటు పంపిణీ కూడా చేసేశారు. గత ఏడాది ఈ నోటును కూడా ఆర్బీఐ రద్దు చేసింది.



నాయకుల నిట్టూర్పు

ఇలా వెయ్యి, రూ.2వేల నోట్లు కనుమరుగు కావడంతో ఇచ్చి పుచ్చుకోవడానికి సులభంగా ఉండేపెద్ద నోట్లు పోయాయని నాయకులు నిట్టూరుస్తున్నారు. ఎన్నికల సమయంలో పంచేందుకు అభ్యర్థికి, తీసుకునేందుకు ఓటరుకు సులభంగా ఉండే పెద్దనోట్లు రద్దు కావడం కొంత మేర ఇబ్బందిగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం చలామణిలో ఉన్న పెద్ద నోటు రూ.500దే ఎన్నికల్లో హవా నడుస్తోంది. ఈ ఎన్నికల్లో నాయకుల వద్ద ఎటుచూసినా ఈ నోటే కనిపిస్తోంది.

రూ. 50 లక్షలు స్వాధీనం

గుంతకల్లు, ఏప్రిల్ 28: రైళ్లల్లో మద్యం, గంజాయి తదితర మాదక ద్రవ్యాల రవాణా, డబ్బు తరలింపులపై నిఘా పెట్టిన ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అనధికారికంగా ఉంచిన రూ. 50 లక్షల నగదు లభ్యమైంది. ఆదివారం రైళ్లల్లో, ప్లాట్‌ఫారాలపై ఉన్న ప్రయాణికుల బ్యాగ్‌లను తనిఖీ చేస్తుండగా పెద్ద మొత్తంలో నగదు దొరికింది. పట్టణంలోని కసాపురం రోడ్డులోని సాయి హనుమాన్ అపార్ట్‌మెంట్స్‌లో నివసిస్తున్న అర్చన కార్వా అనే మహిళ 1వ నెం. ప్లాట్‌ఫారం ఎంట్రెన్స్‌లో ఉండగా, ఆమె లగేజీ బ్యాగును అధికారులు తనిఖీ చేశారు. అందులో రూ. 50 లక్షలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు కనుగొన్నారు. ఈ నగదుకు సంబంధించి తగిన ఆధారాలు లేకపోవడంతో డబ్బును ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఎస్ సుబ్బలక్ష్మి, జీఆర్పీ ఎస్ఐ ఎం రామదాసు సీజ్ చేశారు.



సీజ్ చేసిన నగదును చూపుతున్న జీఆర్పీ సీఐ నగేశ్‌బాబు

ప్లీజ్..! మా మాట వినండి

మీకేమి కావాలో చెప్పండి

అభ్యర్థుల విత్‌డ్రా కోసం కొందరు, కొనసాగాలని మరికొందరి ఆఫర్

అభ్యర్థుల వెంట పడుతున్న ప్రధాన పార్టీలు

నామినేషన్ల ఉపసంహరణలకు నేటితో ముగియనున్న గడువు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 28 'బాబ్బాబు..! ప్లీజ్ మా మాట వినండి. మీకేమి కావాలో చెప్పండి. చేసి పెడతాం' అంటూ ప్రధాన పార్టీలు నామినేషన్లు వేసిన ఇతర అభ్యర్థులను ప్రాధేయపడుతున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ఇప్పటికే నామినేషన్ల ఘట్టం పూర్తయ్యింది. ప్రస్తుతం అనంత పార్లమెంటు స్థానానికి 21మంది, జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 136 మంది బరిలో ఉన్నారు. ఇందులో రాయదుర్గం నియోజకవర్గం నుంచి 14మంది, ఉరవకొండ నియోజకవర్గం నుంచి 11, గుంతకల్లు నియోజకవర్గం నుంచి 17, తాడిపత్రి నియోజకవర్గం నుంచి అత్యధికంగా 26, శింగనమల నియోజకవర్గం నుంచి 16, అనంతపురం అర్బన్‌నుంచి 21, కళ్యాణదుర్గం నుంచి 16, రాప్తాడు నియోజకవర్గం నుంచి 11మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అయితే ఎన్నికల కమిషన్ షెడ్యూల్ మేరకు ఈ అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి సోమవారం వరకు గడువు ఉంది. ఉదయం నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లను ఉపసంహరించు కోవచ్చు.

ప్రధాన పార్టీల ఎత్తుకు పైఎత్తులు

ఈసారి అసెంబ్లీ ఎన్నికలు ప్రధాన పార్టీలైన తెలుగుదేశం, వైసీపీలకు చాలా కీలకంగా మారాయి. అధికారంలో ఉన్న ఉన్న వైసీపీ ఎలాగైనా గెలవాలనే తలంపుతో తొలి నుంచే అక్రమ వ్యవహారాలకు తెర తీసింది. తాజాగా నామినేషన్ల ఉపసంహరణ విషయంలో కూడా వైసీపీ కుట్రలు పన్నుతూ వస్తోంది. టీడీపీ అభ్యర్థులకు ఏవిధంగా నష్టం చేయవచ్చో ప్రణాళిక రచిస్తోంది. టీడీపీ అభ్యర్థుల పేర్లు ఉన్న కొంతమందిని ఎన్నుకొని వారితో నామినేషన్లు వేయించారని చెబుతున్నారు. ప్రధానంగా రాయదుర్గం, ఉరవకొండ, రాప్తాడు, అనంతపురం అర్బన్, గుంతకల్లు నియోజకవర్గాలలో ఇలాంటి కుతంత్రాలు పన్నినట్లు తెలుస్తోంది. రాయదుర్గంలో టీడీపీ అభ్యర్థి పేరును పోలి ఉన్న కావలి శ్రీనివాసులు, కురబశ్రీనివాసులతో నామినేషన్ వేయించారు. వారివల్ల టీడీపీకి పడే కొన్ని ఓట్లయినా పక్కకు పోతాయిని దానివల్ల కొంత లాభపడవచ్చని వైసీపీ ఆలోచిస్తోంది. అయితే కావలి శ్రీనివాసులను విత్‌డ్రా చేయించడానికి టీడీపీ ప్రయత్నిస్తుండగా పోటీలో నే ఉండేలా చూసేందుకు వైసీపీ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. రాప్తాడు నియోజకవర్గంలో కూడా ఒక బీసీ వ్యక్తిని టీడీపీకి వ్యతిరేకంగా నామినేషన్ వేయించారు. ఆయనను ఉపసంహరించుకోవడానికి టీడీపీ ప్రయత్నిస్తుంటే ఆపని జరగకూడదని అధికార వైసీపీ అభ్యర్థి విశ్వప్రయత్నాలు చేస్తున్నార న్న ప్రచారం జరుగుతోంది. తాడిపత్రి, ఉరవకొండ, అనంతపురం నియోజక వర్గాలలో కూడా ఇలాగే అధికార, ప్రతిపక్షా మధ్య ఎత్తుకు పైఎత్తులు సాగుతున్నాయి.



కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా

ఎన్నికల తేదీ సమీపిస్తుండటంతో జిల్లా యంత్రాంగం మరింత అప్రమత్తమైంది. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ఉండటంతో కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి వినోద్ కుమార్ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశారు. ఎంపీ అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ కలెక్టరేట్‌లోను, అసెంబ్లీ అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ఆయా నియోజకవర్గ ఆర్ఓ కార్యాలయాలలోను కొనసాగుతోంది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ విత్ డ్రాకు అవకాశం ఉంటుంది. ఈనేపథ్యంలో ఆయా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

ఫైనల్ జాబితా నేడే

ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థుల తుది జాబితా సోమవారం సాయంత్రం అధికారికంగా వెల్లడించనున్నారు. ప్రస్తుతం అనంతపురం పార్లమెంటుకు 21మంది, ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు కలిపి 136 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందాయి. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత మిగిలే అభ్యర్థులే ఈఎన్నికలలో పోటీచేసే ఫైనల్ అభ్యర్థులుగా బరిలో ఉంటారు.

హలో..! ఏనప్ప నిమ్మూరల్లి యారు గెలితారే..?



రాయదుర్గం, ఏప్రిల్ 28: హలో..! ఏనప్పా నిమ్మూరల్లి యారు గెలితారే..?(ఏమప్పా మీ ఊరిలో ఎవరు గెలుస్తారు) అంటూ రాయదుర్గం నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఫోన్‌లో ఆరాలు తీయడం ఎక్కువైంది. కర్ణాటకకు సరిహద్దులో ఉండటంతో ఈ నియోజకవర్గంలోని అధికశాతం ప్రజలు కన్నడ ఎక్కువగా మాట్లాడతారు. ఇక్కడి ప్రజలకు బెంగళూరు, బళ్లారి, చిత్రదుర్గం, చెళ్లకెర ప్రాంతాలతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో బంధుత్వాలు ఉన్నాయి. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ జరుగుతుండటంతో రోజూ సెల్‌ఫోన్‌లలో కన్నడ భాషలో అక్కడి ప్రాంత బంధువులు, మిత్రులు వ్యాపారులు మీ ఊరిలో జరుగుతున్న ఎన్నికల్లో ఎవరు గెలుస్తారని అడుగుతున్నారు. హోటళ్ల, కూడళ్ల వద్ద సరిహద్దు గ్రామాల్లో, సెల్‌ఫోన్‌లలో ఇదే చర్చ ప్రస్తుతం జరుగుతోంది. అంతే కాకుండా రాయదుర్గం నుంచి బెంగళూరుతో పాటు ఇతర ప్రాంతాలకు కర్ణాటక బస్సులు నిత్యం రాకపోకలు సాగిస్తాయి. ఆ బస్సుల్లో కూడా ప్రయాణికుల మధ్య కన్నడ భాషలో రాజకీయ చర్చలే జరుగుతున్నాయి.

ఏపార్టీకైనా బ్యాండ్ వాయిస్తాం



కొర్తికోటలో బ్యాండ్‌బాజా వాయిస్తున్న కళాకారులు

వారు ఏపార్టీకైనా బ్యాండ్ వాయిస్తారు. ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా సాగాలన్నా, పార్టీవారు ఊరిలోకి వచ్చారని తెలియాలన్నా, వీరే బ్యాండ్ బాజాదే ముఖ్య పాత్ర. ఎన్నికల సమయం కావడంతో బ్యాడ్ వాయించే వారిని అన్నిపార్టీలు తమ ప్రచారానికి వినియోగించుకుంటున్నారు. కదిరి నియోజకవర్గంలో ఏగ్రామం, పట్టణంలో ప్రచారం జరిగినా ముందు బ్యాండ్‌బాజా వాయించేవారే ఉంటారు. ఆదివారం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ తనకల్లు మండలంలోని కొర్తికోట గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఒకగ్రూపులో పదినుంచి 15మంది సభ్యులు ఉంటారు. రోజుకు రూ.10వేల నుంచి 15వేలు సంపాదన ఉంటుంది. ఎన్నికల ప్రచారం ప్రారంభమైనప్పటినుంచి బ్యాండ్‌కు డిమాండ్ పెరిగింది. మామూలుగా శుభ కార్యక్రమాలకు నెలలో పది, 15రోజులు మాత్రమే పని ఉంటే ఎన్నికల సమయంలో రోజూ పని ఉంటోందని పలువురు బ్యాండ్ సిబ్బంది పేర్కొన్నారు.

- కదిరి

ఇదేం రాజకీయం..

బోరుబావి తవ్వకుండా అడ్డుకున్న వైసీపీ నాయకులు



విచారిస్తున్న అధికారులు

ఉరవకొండ, ఏప్రిల్ 28: పాలకులు, అధికారులు పట్టించుకోకపోవ డంతో గుక్కెడు నీటి కోసం ఆ కాలనీ ప్రజలు చేస్తున్న ప్రయత్నాలను కొందరు వైసీపీ నాయకులు అడ్డుకున్నారు. దీనిపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వివరాలు ఇలా.. పట్టణంలోని కోట వీధిలో తాగు నీటి సమస్య తీవ్రం కావడంతో కాలనీవాసులు సొంతంగా బోరు వేసుకోవడానికి విరాళాలు సేకరించారు. శనివారం రాత్రి బోరు వేసుకునేందుకు కాలనీ వాసులు ప్రయత్నించారు. దాన్ని కొందరు వైసీపీ నాయకులు అడ్డుకుని ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ కాలనీకి ఆదివారం అధికారులు విచారణకు వెళ్లారు. రంజాన్ పండుగ ముందే నీటి సమస్య తీర్చాలని అధికారులను కాలనీ వాసులు కోరారు. కొత్తగా బోరు వేయడానికి తమ వద్ద నిధులు లేవని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. దీంతో కాలనీవాసులు సొంతంగా బోరు వేసుకోవడానికి విరాళాలు సేకరించుకున్నారు. అధికారుల అనుమతితోనే బోరు వేయడానికి యత్నించగా, వైసీపీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో కాలనీ వాసులు అంతా తిరగబడ్డారు. వైసీపీ నాయకులు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. తమ నీటి సమస్యను తీర్చాలని విచారణకు వచ్చిన అధికారులను ప్రజలు నిలదీశారు.

భవిష్యత్తును కాపాడేవారినే ఎన్నుకోండి

జడ్పీ సీఈఓ వైభోమ్ నిదియా



ర్యాలీలో జడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓ, ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఎన్నికల నిఘా వేదిక సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 28: ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని, భవిష్యత్తును కాపాడే నాయకులను ఎన్నుకోవాలని జడ్పీ సీఈఓ వైభోమ్ నిదియా పేర్కొన్నారు. ఓటు ప్రాధాన్యంపై అవగాహన కల్పించేందుకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన ర్యాలీని జడ్పీ సీఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు పౌరులకు వజ్రాయుధమని తెలిపారు. ప్రతి ఓటరు అవినీతి లేని సమాజ స్థాపన, అభివృద్ధిని కాంక్షించే నాయకులను ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలన్నారు. ఓటు హక్కు వినియోగించుకోని ప్రజలు సమస్యలు పరిష్కరించాలని అడిగే హక్కు కోల్పోతారని తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్, శ్రీకంఠం సర్కిల్, రాజురోడ్డు, సప్తగిరిసర్కిల్, సుభాష్‌రోడ్డు, టవర్‌క్లాక్ మీదుగా ఆర్ట్స్ కళాశాల వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈఓ లలితాబాయి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ జిల్లా ప్రతినిధి మమత, ఎన్నికల నిఘావేదిక రీజనల్ కన్వీనర్ కంబదూరు షేక్ నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల వద్దకే పింఛన్..



అనంతపురం క్లాక్‌టవర్/టౌన్, ఏప్రిల్ 28 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో లబ్ధిదారులకు ఎట్టకేలకు ఇంటివద్దే పింఛన్ సొమ్ము పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆదివారం కలెక్టర్ వినోద్‌కుమార్, డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ నరసింహారెడ్డి పింఛన్ పంపిణీ మార్గదర్శకాలను విడుదల చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పింఛన్‌దారులకు మే, జూన్ నెలలకు సంబంధించి బ్యాంకు ఖాతాలకు లేదా ఇంటివద్దకే సొమ్ము అందజేయనున్నట్లు వెల్లడించారు. పింఛన్‌దారులు సచివాలయాలు, ఇతర కార్యాలయాల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. మే, జూన్ నెలలకు సంబంధించి పింఛన్ లబ్ధిదారుల ఆధార్ అనుసంధానమైన ఎన్‌పీసీఐ ద్వారా నిర్ధారించిన బ్యాంకు ఖాతాలకు జమచేస్తామన్నారు. బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాని పింఛన్‌దారులకు, ప్రత్యేక కేటగిరి విభిన్నప్రతిభావంతులు, మంచానికే పరిమితమైన వారికి, దీర్ఘకాలిక వ్యాధి బాధితులకు, నడవలేని స్థితిలో ఉన్న లబ్ధిదారులకు ఇళ్ల వద్దే పింఛన్ పంపిణీ చేస్తామని వెల్లడించారు. ఈనెల 30న ఆయా మండలాల గ్రామ సచివాలయాలు, మున్సిపాలిటీల వార్డు సచివాలయాలల్లో పింఛన్ సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమచేసిన వివరాలు అందుబాటులో ఉంచుతామన్నారు. బ్యాంకు ఖాతాల్లో జమకాని వారికి 3వతేదీన ఇంటివద్దే పింఛన్ పంపిణీ చేస్తామని తెలిపారు. డీఆర్‌డీఏ అధికారులతో పాటు ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు బాధ్యత తీసుకోవాలన్నారు. మే 1న సెలవు కావడంతో 2న అన్ని బ్యాంకుల్లో పింఛన్ పంపిణీకి సరిపడు సొమ్మును అందుబాటులో ఉంచుకోవాలని బ్యాంకర్లకు ప్రభుత్వం సూచించింది.

జోరుగా పూల వ్యాపారం



పెళ్లిళ్లు, శుభకార్యాలు పెద్దగా లేకపోయినా ఎన్నికల పుణ్యమా అని పూల వ్యాపారం మూడు బొకేలు, ఆరు దండలుగా జోరుగా సాగుతోంది. నామినేషన్లు, ప్రచార పర్వంలో నాయకులు, కార్యకర్తలు తమ అభిమాన నేతలను సన్మానించేందుకు పూల దండల కోసం బారులు తీరుతున్నారు. గ్రామాల్లో ఎన్నికల ప్రచారానికి వస్తున్న నాయకులను సన్మానించేందుకు పూలమాలలు, పుష్పగుచ్ఛాలు విరివిగా కొనుగోలు చేస్తుండటం వల్ల పూల వ్యాపారం జోరందుకుంది. నగరం, పట్టణం, గ్రామం అని తేడా లేకుండా అన్నిచోట్లా పూలకు ఒక్కసారిగా డిమాండ్ వచ్చింది. ముందుగానే అర్డర్లు ఇచ్చి మరీ దండలను తయారు చేయించుకుంటున్నారు.

- కొత్తచెరువు

పార్టీ మీటింగ్‌కు అందరూ రావాల్సిందే !

ఎంఎల్ఓ కుళ్లాయప్ప వాయిస్ మెసేజ్



విడపనకల్లు, ఏప్రిల్ 28: 'మీరు ఏమి చేసుకుంటారో.. ఏమో.. మీటింగ్‌కు అందరూ రావాల్సిందే. సోమవారం ఉదయం 8 గంటలకు ఉరవకొండ వైసీపీ ఆఫీసులో మీటింగ్ జరుగుతుంది. విశ్వేశ్వరరెడ్డి, ప్రణయ్‌రెడ్డి వస్తారు. మీరు వంద శాతం రావాల్సిందే' అని మండల ఎంఎల్ఓ కుళ్లాయప్ప శనివారం నుంచి వాట్సాప్ గ్రూపుల్లో వలంటీర్లకు వాయిస్ మెసేజ్ పంపుతున్నాడు. ఎన్నికలు సమీపిస్తున్నందున వైసీపీని ఎలా గెలిపించుకోవాలి అనే అంశంపై చర్చించేందుకు ఉరవకొండలో విశ్వేశ్వరరెడ్డి, ప్రణయ్‌రెడ్డి నియోజకవర్గంలోని వలంటీర్లతో సమావేశం నిర్వహించనున్నారు. రాజీనామా చేసిన వలంటీర్లు, చేయని వారు అందరూ హాజరు కావాలన్నారు. ఇదే వలంటీర్లకు చివరి సమావేశం అన్నారు. వారం రోజుల కిందట కూడా రాజీనామా చేయాలని వాట్సాప్‌లో వాయిస్ మెస్సేజ్‌లు పెట్టి వలంటీర్లను బెదిరించాడు. దీనిపై టీడీపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎంఎల్‌ఓ వైసీపీ కార్యకర్తలాగా ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ ప్రచారం చేస్తున్నాడనీ, అతడిపై ఎన్నికల అధికారుల ఎందుకు చర్యలు తీసుకోవటంలేదని ప్రశ్నిస్తున్నారు.

ఓటు వేస్తూ సెల్ఫీ దిగడం నిషిద్ధం



పోలింగ్ కేంద్రంలో ఓటరు తన ఓటుహక్కును వినియోగించుకునే సమయంలో సెల్ఫీ దిగడం, ఇతరులకు చూపించడం నిషిద్ధం. ఒకవేళ అలా చేస్తే నిబంధన 49 ఎం(ఓటు రహస్యం) బహిర్గతం నియమం మేరకు ఎన్నికల అధికారులు గుర్తించి ఓటరును బయటకు పంపుతారు. ఆ ఓటును నిబంధన 17ఏలో నమోదు చేస్తారు. లెక్కింపు సమయంలో ఆ ఓటును పరిగణనలోకి తీసుకోరు. నిబంధన 49ఎం ప్రకారం అంధులైన ఓటర్లు తమ ఓటు వేయడానికి 18 సంవత్సరాలు దాటిన సహాయకుడిని వెంట తీసుకెళ్లవచ్చు. సహాయకుడు అతడి ఓటును బహిర్గత పరచనని నిబంధన 10లో ధ్రువీకరించాల్సి ఉంటుంది.

- కదిరిఅర్బన్

ఎన్నికల్లో పిల్లలతో పనులు చేయిస్తే చర్యలే

ఎన్నికలప్రక్రియలో పిల్లలతో పనులు చేయించరాదని కమిసన్ చెబుతోంది. నిబంధనల మేరకు 18 సంవత్సరాల లోపు పిల్లలతో ఎలాంటి ఎన్నికల పనులు చేయించరాదు. బాలకార్మిక చట్టం ప్రకారం ఎన్నికల కార్యాలయాల్లో పనులు చేయించుకున్నా, కరపత్రాలు పంపిణీ చేసినా, ఫ్లెక్సీలు, జెండాలు కట్టించినా, ప్రచారంలో తిప్పినా సంబంధిత నాయకులు, కార్యకర్తలపై నిబంధనల ప్రకారం అధికారులు చర్యలు తీసుకోవచ్చు. పిల్లలను పనులకోసం ప్రోత్సహించే తల్లిదండ్రులను కూడా దోషులుగా పరిగణిస్తారు. తీవ్రత ఆధారంగా అభ్యర్థులపై కేసులు నమోదు చేసే అవకాశాలుంటాయి. ఈమేరకు ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు చేయవచ్చు.

- కదిరిఅర్బన్

అనంతకు మరో ఎన్నికల పరిశీలకుడు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 28: సార్వత్రిక ఎన్నికల నిర్వహణ జిల్లాలో ఎలా చేపడుతున్నారో పరిశీలించడానికి కేంద్ర ఎన్నికల పరిశీలకులు జిల్లాకు వస్తున్నారు. ఇప్పటికే వ్యయ పరిశీలకులు, జనరల్ పరిశీలకులు ముగ్గురు జిల్లాకు చేరుకున్నారు. తాజాగా ఆదివారం గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల, అనంతపురం నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల జనరల్ పరిశీలకులు మనీష్‌సింగ్ ఐఏఎస్ అనంతకొచ్చారు. ఆయన ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఉండగా అక్కడకు కలెక్టరు వినోద్ కుమార్ వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పరిశీలకులు తమ నియోజకవర్గాలలో ఎన్నికల నిర్వహణ అక్కడి పరిస్థితులు గురించి కలెక్టరు ద్వారా అడిగి తెలుసుకున్నారు.

'ఆదరణ' ఏదీ..?



శింగనమల: టీడీపీ పాలనలో కులవృత్తులతో జీవనోపాధి పొందే వారు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఆదరణ పథకం కింద పనిముట్లు అందజేసేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆపథకం ఎత్తివేశారు. అప్పట్లో చంద్రబాబునాయుడు కులవృత్తులు చేసేవారికి ఉచితంగా ఆదరణ పథకం కింద పనిముట్లు ఇచ్చారు. మా కుటుంబానికి కూడా రెండు కుర్చీలు వచ్చాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ కుర్చీ ద్వారానే కులవృత్తి చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నా. జగన్ వచ్చాక చేయూత పేరుతో ఏడాదికి రూ.10వేలు ఇస్తున్నాడు. మేము నాలుగురు అన్నతమ్ముళ్లం నాలుగు బంకులు వేసుకొని ఉన్నాము. వైసీపీ ప్రభుత్వం పెట్టిన నిబంధనలతో మాలో ఇద్దరికి మాత్రమే చేయూత పథకం లబ్ధి అందుతోంది. ఆనాడు చంద్రన్న ఇచ్చిన పనిముట్లతోనే ఇప్పటికీ మాకుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి.

- మణికుమార్, నాయీబ్రాహ్మణుడు, శింగనమల

పెంచిన పింఛన్ ఇవ్వడానికి ఐదేళ్లా..?



కదిరిఅర్బన్: గతంలో చంద్రబాబు ఇచ్చే రూ.రెండువేల పింఛన్‌ను జగన్ రూ.మూడువేలు చేస్తానని హామీ ఇచ్చారు. పెంచిన పింఛన్ ఇవ్వడానికి ఐదేళ్లు పట్టింది. ఏడాదికొక్కసారి రూ.250లు పెంచుతానని ఎన్నికలకు ముందు చెప్పలేదు. ఇపుడు ఇచ్చే రూ.మూడువేలకు రూ. ఐదవందలు పెంచి ఇస్తానంటున్నారు. ఇది కూడా మూడేళ్ల తరువాత ఏడాదికి రూ.250 చొప్పున పెంచుతానని హామీ ఇస్తున్నారు. ఇది ప్రజలు నమ్మే స్థితిలో లేరు. చంద్రబాబు రూ.నాలుగువేలు ఇస్తానంటున్నారు. రూ.నాలుగువేలు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇస్తామంటున్నారు. ఇది పింఛన్‌దారులకు ఎంతో ఉపయోగం.

- పాపులమ్మ, ఎగువపల్లి, కదిరి మండలం

ఫ్యాన్ గాలికి... జగన్ హామీ



- హరీశ్‌రెడ్డి, పాపంపేట, అనంతపురం రూరల్ మండలం.

అధికారంలోకి వస్తే ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని గత ఎన్నికలకు ముందు సీఎం జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర యువతకు హామీ ఇచ్చారు. అయితే ఐదేళ్ల కాలంలో ఒక్కసారి కూడా జాబ్ క్యాలెండ్ విడుదల చేయలేదు. పైగా ఉన్నత విద్యను కూడా యువతకు దూరం చేశాడు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఆ హామీ ఫ్యాన్ గాలిలో కొట్టుకుపోయింది. ఐదేళ్ల కాలంలో ఒక్కటంటే ఒక్క పరిశ్రమకూడా రాలేదు. స్టార్టప్ కంపెనీలకు ప్రోత్సాహం లేదు. టీడీపీ పాలనలోనే ఉమ్మడి జిల్లాకు కియ పరిశ్రమ తెచ్చి ఎంతో మందికి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారు. అది కూడా లేకపోతే..ఇతరప్రాంతాలకు వెళ్లిపోయే పరిస్థితి. సంక్షేమంతోపాటు..అభివృద్ధి చేసేవారిని గెలిపించుకోవాలి.

- అనంతపురం రూరల్

రాప్తాడు పేరు వెనుక...

రాప్తాడు గ్రామం పక్కనే పండమేరు వంక ఉంది. అప్పట్లో ఆ వంకలో నిత్యం నీరు ప్రవహించేవి. బ్రిటీష్ వారు పరిపాలించే కాలంలో పండమేరు వంకను దాటేందుకు రాప్తాడు గ్రామస్థుల సహాయం తీసుకునేవారు. బ్రిటీష్ వారు వంకను దాటేందుకు తాడు (రోప్) ద్వారా గ్రామస్థుల సహాయంతో దాటేవారు. బ్రిటీష్ వారు వంకను దాటేటప్పుడు గ్రామస్థులతో రోప్ అని ఇంగ్లీష్‌లో, తాడు అని తెలుగులో మాట్లాడేవారు. రోప్, తాడు తీసుకురండి అని పిలిచేవారు. కాలక్రమేణా రోప్, తాడు అనే పదాలు రాప్తాడుగా మారాయి.



నియోజకవర్గ చరిత్ర

రాప్తాడు నియోజకవర్గం ఉమ్మడి జిల్లాలోనే ప్రత్యేకమైనది. రెండు జిల్లాల పరిధిలో విస్తరించి ఉండటం నియోజకవర్గ విశేషం. నియోజకవర్గంలో ఒక్క ప్రధాన పట్టణంగాని, మున్సిపాలిటీగాని లేవు. అన్ని మండలాల్లోనూ వ్యవసాయమే జీవనాధారంగా రైతులు, కూలీలు జీవనం సాగిస్తున్నారు. ఒకప్పుడు కనుచూపు మేర బీడు భూములే కనిపించేవి. అటువంటి తరుణంలో హంద్రీనీవా ప్రధాన కాలువ నియోజకవర్గంలో వెళ్లడంతో చాలా వరకూ సాగునీటి సమస్య తీరింది. పేరూరు ప్రాజెక్టుకు నీటి సరఫరా సమస్య అలాగే ఉంది. ఒకప్పుడు వేలాది మందికి ఉపాధినిచ్చిన రామగిరి మండలంలో బంగారు గనులు మూతపడ్డాయి. చాలా గ్రామాల్లో తాగునీటి సమస్య తాండవిస్తోంది. గ్రామీణ రహదారులు అధ్వానంగా ఉన్నాయి.

శ్రమజీవుల నేల

- రైతులు.. కూలీలు అధికం
- రెండు జిల్లాల పరిధిలో రాప్తాడు
- ప్రధాన పట్టణాలు, మున్సిపాలిటీలు లేవు
- హంద్రీనీవా వచ్చేదాకా బీడు భూములే..

రాప్తాడు, ఏప్రిల్ 28: పునర్విభజనలో భాగంగా 2009లో రాప్తాడు నియోజకవర్గం ఏర్పడింది. అంతకు ముందు రాప్తాడు, అనంతపురం రూరల్, ఆత్మకూరు మండలాలు అనంతపురం నియోజకవర్గంలో ఉండేవి. రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలు పెనుకొండ నియోజకవర్గంలో ఉండేవి. 2009లో రాప్తాడు, అనంతపురం రూరల్, ఆత్మకూరు, రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలను రాప్తాడు నియోజకవర్గంగా ఏర్పాటు చేశారు. నియోజకవర్గం ఆవిర్భావం నుంచి ఇప్పటికి మూడు సార్లు సాధారణ ఎన్నికలు జరిగాయి. 2009, 2014లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పరిటాల సునీత, 2019లో వైసీపీ అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విజయం సాధించారు. నియోజకవర్గం 2022 చదరపు కిలోమీటర్లు విస్తరించి ఉంది. మొత్తం జనాభా 3,46,090 మంది ఉన్నారు. 2009లో పరిటాల సునీతకు అత్యల్ప మెజార్టీ 1750 ఓట్లు, 2019లో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి 25,575 ఓట్ల అత్యధిక మెజార్టీ వచ్చింది.

ఎంత దూరమో..

రాప్తాడు నియోజకవర్గం జిల్లా కేంద్రమైన అనంతపురం నుంచి కర్ణాటక సరిహద్దు వరకూ విస్తరించి ఉంది. రాప్తాడు, అనంతపురం రూరల్ మండలాలు జిల్లా కేంద్రమైన అనంతపురానికి కూత వేటు దూరంలో ఉన్నాయి. రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి మండలం కర్ణాటక ప్రాంతానికి సరిహద్దుగా ఉంది. అనంతపురం నుంచి చెన్నేకొత్తపల్లి వరకూ దాదాపు 50 కి.మీ 44వ జాతీయరహదారి విస్తరించి ఉంది.

రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గం - మండలాలు



సంవత్సరం	ఎమ్మెల్యే	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
2009	పరిటాల సునీత	టీడీపీ	తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి	కాంగ్రెస్	1750
2014	పరిటాల సునీత	టీడీపీ	తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి	వైసీపీ	7774
2019	తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి	వైసీపీ	పరిటాల శ్రీరామ్	టీడీపీ	25,575

ప్రస్తుత ఓటర్లు

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
రాప్తాడు	17,582	17,774	3	35,359
అనంతపురంరూరల్	39,517	40,438	7	79,962
ఆత్మకూరు	16,566	16,698	1	33,265
కనగానపల్లి	16,849	16,572	1	33,422
రామగిరి	14,786	14,404	0	29,190
చెన్నేకొత్తపల్లి	18,781	18,333	1	37,115
మొత్తం	1,24,081	1,24,219	13	2,48,313

నీరు కరువు

రామగిరి మండలం పేరూరులో పెన్నానదిపై 1950లో నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూ. 1.80 కోట్లతో 2 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మించారు. పెన్నానది నీరు, వర్షపు నీటితో ఈ ప్రాజెక్టుకు నీరు రావాలి. పెన్నానదిలో కర్ణాటకలో అక్రమ ప్రాజెక్టులు, చెక్ డ్యాంలు నిర్మించడం వలన ఈ ప్రాజెక్టుకు నీరు రావడం కష్టంగా మారింది. ఈ ప్రాజెక్టులో నీరు సమృద్ధిగా ఉంటే 11 వేల ఎకరాల ఆయకట్టు భూమి సాగులోకి వస్తుంది. రామగిరి, కంబదూరు, కనగానపల్లి, రాప్తాడు మండలాల్లో బోర్లలో భూగర్భ జలాలు పెరుగుతాయి. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాదయాత్ర సమయంలో రామగిరి మండలంలో పర్యటించినప్పుడు పేరూరు ప్రాజెక్టు గురించి వివరించి నీరు తీసుకురావాలని పరిటాల సునీత విన్నవించారు. 2014 నుంచి 2019 వరకూ ఆమె మంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబుతో మాట్లాడి జీడిపల్లి జలాశయం నుంచి కృష్ణా జలాలు పేరూరు డ్యాంకు వచ్చేలా 62 కి.మీ కాలువ తవ్వేందుకు దాదాపు రూ.803 కోట్లు నిధులు మంజూరు చేయించారు. కాలువ పనులు చేపడుతున్న సమయంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు నిలిపి వేశారు.



చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లి నుంచి ఆమిదాలకుంట వరకూ అధ్వానంగా ఉన్న రోడ్డు



ఇవే కీలకం..

రాప్తాడు నియోజకవర్గంలో ఎక్కువగా వ్యవసాయం, పాడి, గొర్రెల పెంపకంపై ఆధారపడి ప్రజలు జీవనం సాగిస్తున్నారు. చెరువులకు నీరు సరఫరా చేయకపోవడంతో రైతులు ప్రభుత్వ తీరుపై ఆగ్రహంగా ఉన్నారు. ముఖ్యంగా 10 ఎకరాల సాగు భూమి ఉన్న వారికి పింఛన్లు, రేషన్ కార్డులు తొలగించారు. వారంతా ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధమయ్యారు. రాప్తాడులో నియోజకవర్గంలో బీసీ ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ముఖ్యంగా కురుబ, బోయ కులస్థుల ఓటర్లు ఎక్కువగా ఉన్నాయి. బీసీ ఓటర్లు ఏ పార్టీకి మద్దతు తెలిపితే వారే విజయం సాధిస్తారు

పరిటాల ముద్ర

రాష్ట్రంలో రాప్తాడు అంటే పరిటాల అనే ముద్ర పడింది. ఒకప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు కలిగిన వ్యక్తి పరిటాల రవీంద్ర. ఆయన మరణాంతరం పరిటాల సునీత రాజకీయ ప్రవేశం చేశారు. 2009లో రాప్తాడు నుంచి పోటీ చేసి గెలుపొందారు. అప్పుడు రాష్ట్రంలో టీడీపీ అధికారంలో లేకపోయినా నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. 2014లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొంది 2019 వరకూ ఐదేళ్లు మంత్రిగా పని చేశారు. ఆ సమయంలో నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.



మౌనగిరి హనుమాన్ క్షేత్రంలో 39 అడుగుల ఏకశిలా విగ్రహం



పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

తొలి ఎమ్మెల్యే..



రాప్తాడు నియోజకవర్గంలో మొదటిసారి 2009లో ఎన్నికలు జరిగాయి. టీడీపీ అభ్యర్థి పరిటాల సునీత అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై 1750 ఓట్ల మెజార్టీతో మొదటి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో టీడీపీ అభ్యర్థి పరిటాల సునీత వైసీపీ అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై 7,774 ఓట్ల మెజార్టీతో రెండోసారి గెలిచారు. 2014 నుంచి 2019 వరకూ మొదటి రెండున్నరేళ్లు పౌరసరఫరాల శాఖ మంత్రిగా, తరువాత రెండున్నరేళ్లు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రిగా పని చేశారు.

రెండు జిల్లాల పరిధి...

2023లో జిల్లాల పునర్విభజన చేసినప్పుడు రాప్తాడు నియోజకవర్గాన్ని రెండుగా విభజించారు. నియోజకవర్గంలోని రాప్తాడు, అనంతపురం రూరల్, ఆత్మకూరు మండలాలను అనంతపురం జిల్లాలో కలిపారు. రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలను శ్రీ సత్యసాయి జిల్లాలో కలిపారు. మూడు మండలాలను ఒక జిల్లాలో, మరో మూడు మండలాలను ఇంకొక జిల్లాలో కలపడం ద్వారా అనేక సమస్యలు ఎదురవుతున్నాయి.

మూతపడిన బంగారు గనులు



మట్టిలో నుంచి బంగారు ఉత్పత్తి చేసేందుకు రామగిరిలో 1984లో భారత్ గోల్డ్ మైన్స్ ఆధ్వర్యంలో ప్రభుత్వం బంగారు గనులు ఏర్పాటు చేసింది. బంగారు గనులు ఏర్పాటు చేయడం ద్వారా మూడు వేల మందికి అప్పట్లో ఉపాధి కలిగింది. నష్టాలు అధికం కావడంతో 2001లో బంగారు గనులు మూత పడ్డాయి. దీంతో గనులను నమ్ముకున్న కార్మికులు ఉపాధి కోల్పోయారు. ప్రస్తుతం బంగారం ధర బాగా పెరిగింది. బంగారు గనులను ప్రారంభిస్తే ప్రభుత్వానికి మంచి లాభాలు రావడంతో పాటు వేలాది మందికి ఉపాధి కలుగుతుంది. రామగిరి గనుల్లో బంగారంతో పాటూ వెండి, ప్లాటినం ఖనిజాలు కూడా ఉన్నాయని, వాటిని వెలికితీస్తే ప్రభుత్వానికి మంచి ఆదాయం వస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

హంద్రీనీవాతో...

ఒకప్పుడు రాప్తాడు నియోజకవర్గం కరువుకు నిలయంగా ఉండేది. కనుచూపు మేర బీడు భూములే కనిపించేవి. అటువంటి తరుణంలో హంద్రీనీవా ప్రధాన కాలువ నియోజకవర్గంలో వెళ్లడంతో చాలా వరకూ సాగునీటి సమస్య తీరింది. 2014 నుంచి 2019 వరకూ మంత్రిగా పనిచేసిన పరిటాల సునీత రాప్తాడు నియోజకవర్గంలో హంద్రీనీవా ప్రధాన కాలువ పనులు పూర్తయ్యేలా కృషి చేశారు. చెరువులకు నీరందించడంతో బోర్లలో భూగర్భ జలాలు పెరిగాయి.

గాలిమరలతో ఉపాధి..

నియోజకవర్గంలోని రామగిరి, ఆత్మకూరు మండలాల్లో పలు ప్రైవేటు కంపెనీలు దాదాపు 100 గాలి మరలు ఏర్పాటు చేశాయి. వీటితోదాదాపు 200 మందికి పైగా ఉపాధి లభించింది. ఇవి కేవలం గాలి కాలంలో మాత్రమే విద్యుత్ ఉత్పత్తి చేస్తాయి. గాలి మర సామర్థ్యం బట్టి రోజుకు 2 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని కంపెనీ నిర్వాహకులు తెలిపారు.



మాట్లాడుతున్న కేంద్ర ఎన్నికల పరిశీలకుడు మనీష్‌సింగ్

అంకితభావంతో.. నిబద్ధతతో పనిచేయండి

ఎన్నికలలో మైక్రో అబ్జర్వర్లు కీలకం

కేంద్ర ఎన్నికల పరిశీలకుడు మనీష్‌సింగ్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 28: ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర చాలా కీలకమని కేంద్ర ఎన్నికల పరిశీలకుడు మనీష్‌సింగ్ పేర్కొన్నారు. జేఎన్‌టీయూలోని ఆడిటోరియంలో ఆదివారం రాయదుర్గం, ఉరవకొండ, కళ్యాణదుర్గం, గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల, అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన అబ్జర్వర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలుత ఆయా నియోజకవర్గాల్లో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయి.. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు.. తదితర వివరాలను పరిశీలకులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మనీష్‌సింగ్ మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల కమిషన్ సూచనలను తప్పకుండా పాటించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో కేటాయించిన విధులను బాధ్యతగా, నిబద్ధతతో నిర్వర్తించాలన్నారు. నివేదికలను త్వరగా అందజేయాలని తెలిపారు. మాక్ పోల్‌ను పర్యవేక్షించాలన్నారు. మరో పరిశీలకుడు అజయ్‌నాథ్ మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ చాలా ముఖ్యమన్నారు. పోలింగ్ స్టేషన్లలో తమ పాత్ర ఏమిటో స్పష్టంగా తెలుసుకుని ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ పోలింగ్ రోజు సాధారణ పరిశీలకులు అన్నిచోట్లా ఉండలేరు కాబట్టి మైక్రో అబ్జర్వర్లను ఎన్నికల కమిషన్ నియమించిందన్నారు. జిల్లాలో 1031 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, అక్కడ జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఏమైన సమస్యలు ఉంటే సెక్టోరియల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్.. నీ దొంగ హామీలను ప్రజలు నమ్మరు





రామకృష్ణ కాలనీలో వృద్ధురాలితో మాట్లాడుతున్న దగ్గుబాటి ప్రసాద్, ప్రచారం చేస్తున్న దగ్గుబాటి శ్రీలక్ష్మి

కూటమి అనంత అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 28: జగన్‌రెడ్డి... నీ దొంగ హామీలు ప్రజలు నమ్మరని అనంత అర్బన్ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం రాజీవ్ చిల్డ్రన్ పార్కు, ఇండోర్ స్టేడియంలో ప్రచారం నిర్వహించారు. అక్కడి వాకర్స్‌తో కలిసి కొద్దిసేపు వ్యాయామం చేశారు. ఇండోర్ స్టేడియంలో సెటిల్ ఆడుతూ అందరినీ ఆకట్టుకున్నారు. స్టేడియం, పార్కుల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కనీసం తాగునీరు కూడా లేకుండా చేశారని కొందరు వాపోయారు. దగ్గుబాటి ప్రసాద్ మాట్లాడుతూ... అనంతపురానికి సంబంధించి సీఎం జగన్, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఒక్క హామీని కూడా నేరవేర్చలేదన్నారు. చంద్రబాబును గెలిపించేందుకు ప్రజలంతా ఎదురు చూస్తున్నారన్నారు. అనంతపురం రూరల్ పంచాయతీ పరిధిలోని రామకృష్ణ కాలనీలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

బాబును మళ్లీ సీఎం చేద్దాం

చంద్రబాబును మళ్లీ సీఎంగా చేద్దామని, ఇది రాష్ట్రానికి.. ప్రజల సంక్షేమానికి ఎంతో అవసరమని దగ్గుబాటి ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... జగన్ మాటలు.. ఆయన చేసే పనులు వెన్నపూసిన కత్తిలా ఉంటాయని.. అది ప్రజలకు తగిలే వరకు అర్థం కాదన్నారు. జగన్ ప్రభుత్వంపై యువత, నిరుద్యోగులు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారన్నారు.

కొనసాగిన చేరికలు..

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు కొనసాగాయి. ఆదివారం 33వ డివిజన్ నాయక్ నగర్‌లో దగ్గుబాటి ప్రసాద్, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణలు ప్రచారం చేశారు. ఇదే సమయంలో మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న ఆధ్వర్యంలో 50 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి చేరారు. అలాగే మారుతీ నగర్‌కు చెందిన పలువురు టీడీపీలో చేరారు.

దగ్గుబాటి శ్రీ లక్ష్మీ ప్రచారం

దగ్గుబాటి సతీమణి దగ్గుబాటి శ్రీ లక్ష్మీ స్థానిక 21, 32 డివిజన్ల పరిధిల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 13వ డివిజన్‌లో టీడీపీ కురబ సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ కురబ నారాయణ స్వామి, తెలుగు మహిళా రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని, యూనిట్ ఇన్‌చార్జి చెరుకూరి శివ, స్థానిక 35, 36వ డివిజనల్లో మాజీ కార్పొరేటర్ రాజారావు, 20వ డివిజన్‌లో టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర కార్యదర్శి పీఎం లక్ష్మీప్రసాద్, 11వ డివిజన్‌లో యూనిట్ ఇన్‌చార్జి విజయ్‌కుమార్, మంజునాథ్, రాజేశ్వరి, బోయ మంజులు ప్రచారం చేశారు.



గంపన్న ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు

గ్రామాల్లో టీడీపీ ప్రచారం

అనంతపురంరూరల్: కూటమి అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్, పార్లమెంట్ అభ్యర్థి అంబిక లక్ష్మీనారాయణను గెలిపించాలని టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. మండలంలోని ఎ.నారాయణపురం పంచాయతీ తపోవనంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాయల్ మురళి ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ నాయకులతో కలసి ప్రచారం నిర్వహించారు.

అన్నివర్గాలనూ మోసం చేసిన జగన్

పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ ధ్వజం

రామగిరి, ఏప్రిల్ 28: జగన్‌రెడ్డి అన్ని వర్గాలనూ మోసం చేసి నట్టేట ముంచాడని, రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని మాజీ మంత్రి పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. ఆదివారం వెంకటాపురంలో క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ 15 రోజులు బాగా కష్టపడి ప్రతి గడపను తాకాలని, ఏ ఒక్కరూ నిర్లక్ష్యం చేయరాదని అన్నారు.

శ్మశాన విషయంలోనూ రాజకీయాలా

వైసీపీ నాయకులు గ్రామాల్లో శ్మశానాల విషయంలో కూడా రాజకీయాలు చేస్తున్నారని పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా రామగిరి మండలంలోని కుంటిమద్ది, ఎస్సీ కాలనీ, శేషంపల్లి, సుద్దకుంటపల్లితండా, శ్రీహరిపురం గ్రామాల్లో పర్యటించారు. ఆమె మాట్లాడుతూ.. వైసీపీ నాయకులు గ్రామాల్లో తాగునీరు, సాగునీరు చివరకు శ్మశానాల విషయాల్లో కూడా రాజకీయాలు చేస్తున్నారన్నారు. ప్రకాష్‌రెడ్డి మండలానికి ఏమి చేశారో చెప్పాలన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి...

వెంకటాపురం, అనంతపురం, ధర్మవరం ప్రాంతాలకు చెందిన 70 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్దార్థ సమక్షంలో వీరు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కనగానపల్లి మండలం బాలేపాళ్యం గ్రామానికి చెందిన తొమ్మిది మంది, కేఎస్‌పాళ్యంకు చెందిన 15 మంది, వేపకుంట గ్రామానికి చెందిన 10 మంది, బానుకోట గ్రామానికి చెందిన ఆరుగురు, రామగిరి మండలం పేరూరు గ్రామానికి చెందిన 14 మంది, చెర్లోపల్లికి చెందిన నలుగురు, అనంతపురం రూరల్ మండలం కామారుపల్లికి చెందిన ఐదుగురు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు.

పరిటాల శ్రీరామ్ ముఖాముఖి

ఆత్మకూరు : స్థానిక రామలింగేశ్వర కళ్యాణ మంటపంలో టీడీపీ మండల యువతతో పరిటాల శ్రీరామ్ ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో యువతకు వైసీపీ వల్ల జరిగిన నష్టాన్ని వివరించారు. యువతకు ఐటీ ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, 20 లక్షలు ఉద్యోగాల కల్పన చంద్రబాబుతోనే సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు, మండల ఇన్‌చార్జి బాలాజి, మాజీ కన్వీనర్‌లు మనోరంజన్ పాల్గొన్నారు.





వెంకటాపురం సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల సునీత, ఆత్మకూరులో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

యువతను నట్టేట ముంచిన జగన్

కూటమి ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 28: ఐదేళ్లల్లో సీఎం జగన్ ఉద్యోగ కల్పన అనే విషయాన్ని పూర్తిగా మర్చిపోయి, నిరుద్యోగ యువతను నట్టేట ముంచాడని అనంతపురం పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ మండిపడ్డారు. ఆదివారం అనంత అర్బన్ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్‌తో కలిసి ఆయన పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక ప్రజలు వారిని సాదరంగా స్వాగతం పలికారు. అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... ప్రతి ఏడాది డీఎస్సీ పెడతామని జగన్ హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. ఎన్నికలకు ముందు దగా డీఎస్సీ పెట్టి నిరుద్యోగ యువత ఆశలపై నీళ్ల చల్లారన్నారు. జగన్ పాలనపై నిరుద్యోగులు, యువతతోపాటు అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. వైసీపీ అరాచక ప్రభుత్వాన్ని సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు సీఎం అవ్వగానే తొలి సంతకం డీఎస్సీపైనే పెడతానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కూటమి పథకాలపై అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఉమ్మడి అనంత జిల్లాలో అన్ని ఎమ్మెల్యే స్థానాలతో పాటు రెండు ఎంపీ స్థానాల్లో కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.



ప్రచారం చేస్తున్న అంబికా లక్ష్మీనారాయణ, దగ్గుబాటి

అవి నకిలీ నవరత్నాలు

కూటమి శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 28: రాష్ట్రంలో ప్రజలను మరోసారి మోసం చేయడానికి నకిలీ నవ రత్నాలు-2 మ్యానిఫెస్టోను సీఎం జగన్ విడుదల చేశారని కూటమి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణి శ్రీ, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసా నాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వెంకటాపురం, సంజీవపురం, దయ్యాల కుంటపల్లి, పసులూరు గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. టీడీపీ విడుదల చేసిన సూప ర్‌సిక్స్ పథకాల ముందు జగన్ విడుదల చేసిన ఎన్నికల మ్యానిఫెస్టో వెలవెల పోయిందన్నారు. పింఛన్ జగన్ నాలుగు సంవత్సరాలకు గాను రూ.3500 ఇస్తే.... చంద్రబాబు టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నాలుగు వేలు రుపాయులు ఇస్తార న్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరే విధంగా టీడీపీ మ్యానిఫెస్టో ఉందన్నారు. టీడీపీని గెలిపిస్తే... నిరంతరం అందుబాటలో ఉండి అభివృద్ధి చేసి చూపిస్తానని తెలిపారు. వైసీపీను గెలిపిస్తే.... గ్రామాల్లో ఇసుక, మట్టిని దోచుకుని కోట్లు గడిస్తారన్నారు. నిత్యావసర ధరలు తగ్గాలంటే టీడీపీకు ఓటువేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపాధ్యాక్షుడు పసుపుల హనుమంతురెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, కన్వీనర్ అశోక్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



వెంకటాపురంలో మాట్లాడుతున్న బండారు శ్రావణిశ్రీ

వైసీపీ నుంచి టీడీపీలోకి..: వెంకటాపురంలో వైసీపీ నేతలు చంద్రశేఖర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, దానేశ్వర్‌రెడ్డి, వెంకటనారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డితో పాటు పలువురు కార్యకర్తలు టీడీపీలో చేరారు.

గ్రామాల్లో టీడీపీ విస్తృత ప్రచారం

గార్లదిన్నె : శింగనమల నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి , బండారు శ్రావణి శ్రీ సోదరి బండారు కిన్నెర శ్రీ ఆదివారం మండలంలోని కమలాపురం, కొట్టాలపల్లి, కొప్పలకొండ గ్రామాల్లో స్థానిక నాయకులతో కలసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల కిష్టయ్య, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రామాంజి, వడ్డేర సమితి జిల్లా అధ్యక్షుడు వన్నూర్, మాజీ సర్పంచు పుల్లన్న, టీఎన్‌టీ యూసీ జిల్లా అధికార ప్రతినిధి బాబయ్య పాల్గొన్నారు.

శింగనమల: మండలంలోని గురుగుంట్లలో టీడీపీ మండల నాయకులు ప్రచారం నిర్వహించారు. ఇందులో మండల టీడీపీ కన్వీనర్ ఆదినారాయణ, రాష్ట్ర తెలుగు యువత అధికారి ప్రతినిధి దండు శ్రీనివాసులు, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి, చితంబరిదొర, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

జగన్ మేనిఫెస్టోలో

మైనార్టీలకు స్థానమేదీ?

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 28: సీఎం జగన్ ప్రవేశపెట్టిన ఎన్నికల మెనిఫెస్టోలో మైనార్టీల స్థానం ఎక్కడ ఉందో..? వైసీపీ నాయకులు సమాధానం చెప్పాలని టీడీపీ ముస్లిం, మైనార్టీ విభాగం నాయకులు ప్రశ్నించారు. ఆదివారం స్థానిక శ్రీనగర్ కాలనీలోని దగ్గుబాటి ప్రసాద్ క్యాంపు కార్యాలయంలో టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాలార్ బాషా, నాయకులు ఫిరోజ్ అహ్మద్, బాబాఫకృద్దీన్ మీడియాతో మాట్లాడారు. జగన్‌రెడ్డి మైనార్టీల ద్రోహిగా తయారయ్యాడన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. గత ఎన్నికల్లో ఒక్క చాన్స్ పేరుతో జగన్ మైనార్టీలతో ఓట్లు వేయించుకొని నట్టేట ముంచాడన్నారు. ఎన్టీఆర్ కాలం నుంచి చంద్రబాబు దాకా అనేక మంది మైనార్టీలకు రాజకీయంగా పెద్ద పీట వేశారన్నారు. టీడీపీ హయాంలో అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలను రద్దు చేసి సీఎం జగన్ ఆ వర్గాలను మోసం చేశారన్నారు. ఈ ఎన్నికల్లో మైనార్టీలంతా ఏకమై ఓటుతో వైసీపీకి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎం బాషా, ఇస్మాయిల్, ఖాసీం పాల్గొన్నారు.

ఆర్చరీ శిక్షణ శిబిరాన్ని సందర్శించిన ఎన్నికల పరిశీలకుడు

అనంతపురం క్లాక్‌టవర్ : యుద్ధ కళల్లో ఒక్కటైన ఆర్చరీ (విలువిద్య)పై చిన్నారుల అత్యద్భుత ప్రదర్శన అభినందనీయమని ఎన్నికల పరిశీలకుడు విలాస్ వి షిండే పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కోవ్వూర్‌నగర్‌లో ఉన్న విద్యారణ్య ఓరియాంటల్ స్కూల్‌లోని ఎంకె స్పోర్ట్స్ అకాడమీలో నిర్వహిస్తున్న సమ్మర్ ఆర్చరీ కోచింగ్ క్యాంపును ఆయన సందర్శించారు. ఆర్చరీలో చిన్నారి క్రీడాకారులు చూపుతున్న ఆసక్తిని అభినందించారు. సరదాగా క్రీడాకారులతో కలిసి ఆర్చరీ ప్రాక్టీస్ చేశారు. ఆయన వెంట విశ్రాంత డీఎస్‌డీఓ రమణ, అకాడమీ హెడ్ కోచ్ రాహుల్, కోచ్‌లు, క్రీడాకారులు ఉన్నారు.



ఆర్చరీ శిక్షణ శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు

పశువుల సంత ఆదాయం రూ.3.28 లక్షలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 28: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువుల సంతతో మార్కెట్‌కు రూ.3,28,860 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.1,58,560, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,70,300 ఆదాయం వచ్చిందని తెలిపారు.

ఉద్దేశపూర్వకంగానే పింఛన్ల పంపిణీలో జాప్యం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 28: ఈ నెల కూడా కావాలనే పింఛన్ల పంపిణీని జాప్యం చేసేలా వైసీపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, శవరాజకీయాలకు పాల్పడేందుకు సిద్ధంగా ఉందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. వృద్ధులను ఎండలో తిప్పి ఎవరైనా చనిపోతే దాన్ని విపక్షాలకు మళ్లీ అంటికట్టి శవరాజకీయాలకు పాల్పడి ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తున్నాడన్నారు. ఈసారి అయినా సచివాలయం సిబ్బంది, ప్రభుత్వ సిబ్బందితో ఇంటివద్దనే పింఛన్లు పంపిణీ చేసేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు.

టీడీపీతోనే కురుబల అభివృద్ధి

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 28: టీడీపీతోనే కురుబల అభివృద్ధి, సాధికారత సాధ్యమని కనకదాస హెల్పింగ్ ఫౌండేషన్ ఛైర్మన్ ఎండీ నాగభూషణం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఏపీ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులపై అక్రమ కేసులు బనాయించి ఆత్మహత్య చేసుకునేలా చేశారని మండిపడ్డారు. యాలేరుకు చెందిన మహిళపై భౌతికదాడిచేసి కొప్పు కోశారన్నారు. ఇలా వందలాదిమంది కురుబలు వైసీపీ ప్రభుత్వంలో బాధితులుగా మిగిలారన్నారు. అరాచకాన్ని సాగించే జగన్ కావాలో.... అభివృద్ధిని, సంక్షేమాన్ని అందించి చంద్రబాబునాయుడు కావాలో.. కురుబలు ఆలోచించాలని కోరారు.

గ్రామాల్లో టీడీపీ ప్రచారం

అనంతపురం రూరల్, ఏప్రిల్ 28: మండలంలోని పలు గ్రామాల్లో పరిటాల కుటుంబ సభ్యులు విస్తృత ప్రచారం నిర్వహించారు. కురుగుంటలో స్థానిక నాయకులతో కలసి పరిటాల శైలాజ ఆదివారం ప్రచారం చేపట్టారు. అదేవిధంగా అక్కంపల్లి పంచా యతీలో పరిటాల రవి చిన్నకోడలు తేజశ్వి, రాచానపల్లి పంచాయతీ సిండికేట్ నగర్‌లో పెద్ద కోడలు జ్ఞాన ప్రచారం నిర్వహించారు.

కాపుల దెబ్బకు వైసీపీ గల్లంతు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 28: బలిజ, కాపులకు సీఎం జగన్ చేసిన ద్రోహానికి... ఓటుతో గుణపాఠం చెబుతామని టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి, అనంతపూర్ క్లబ్ సభ్యుడు లక్ష్మన్న పేర్కొన్నారు. ఓబీసీ కోటాలో కాపులకు 2019లో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు ఐదు శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో చేసిన చట్టాన్ని... వైసీపీ ప్రభుత్వం తొలగించడం దారుణమని మండిపడ్డారు. వైసీపీలో ఉన్న కాపు నాయకులు అంబటి రాంబాబు, పేర్ని నాని, గుడివాడ అమర్‌నాథ్, అవంతి శ్రీనివాస్, ముసుగువీరుడు ముద్రగడ పద్మనాభం బలిజ, కాపులకు తీరని ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. సీఎం జగన్‌ను ప్రశ్నించే ధైర్యం లేని దద్దమ్మలు వైసీపీలో ఉన్న బలిజ, కాపు నాయకులని విమర్శించారు. సామాన్య ప్రజలకు అండగా నిలుస్తున్న జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ను విమర్శించే అర్హత వైసీపీ, జగన్‌కు లేదన్నారు. ఎన్నికల్లో వైసీపీకి కాపు, బలిజల దెబ్బ రుచి చూపిస్తామని హెచ్చరించారు.

నేడు నామినేషన్లు ఉపసంహరణ

రాప్తాడు: రాప్తాడు శాసనసభ స్థానానికి నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థుల్లో ఆసక్తి గల వారు సోమవారం నామినేషన్లు ఉపసంహరించుకోవచ్చని రాప్తాడు రిటర్నింగ్ అధికారి వసంత్‌బాబు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ అభ్యర్థులు రాప్తాడు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి నామినేషన్లు ఉపసంహరించుకోవచ్చన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 28: మండలంలోని హంద్రీనీవా కాలువలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఓ యువకుడు హంద్రీనీవా కాలువలోకి చేపలు పట్టడానికి వెళ్లగా... ఓ వ్యక్తి మృతదేహం కనిపించడంతో అతను పోలీసులకు సమాచారం అందించాడు. ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, రామగిరి సీఐ శివాంజనేయులు, ఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చనిపోయిన వ్యక్తి వయస్సు 45-55 మధ్య ఉంటుందని, అతను చనిపోయి 15 రోజులై ఉంటుందని, శవం కుళ్లిపోయి దుర్వాసన వస్తోందని, గుర్తుపట్టడానికి వీలులేకుండా ఉందని తెలిపారు. వ్యక్తి మృతి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు నమోదు చేశామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించామని, ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 94407 96836, 94407 96835ను సంప్రదించాలని సూచించారు.

300 మందికి ఉచిత ఖత్నా

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 28: గఫూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్, గఫూర్ సేవా ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం గఫూర్ కాలనీలో నిర్వహించిన ఉచిత ఖత్నా కార్యక్రమంలో 300 మందికి ఉచితంగా ఖత్నా నిర్వహించారు. కార్యక్రమానికి సీనియర్ జనరల్ సర్జన్, ప్రభుత్వ వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కేవీ మధుసూదన్, డాక్టర్ అబ్దుల్ రజాక్ గఫూర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డాక్టర్ కేవీ మధుసూదన్ మాట్లాడుతతూ... గఫూర్ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో 45 సంవత్సరాలుగా ఉచిత మెడికల్ క్యాంపుల ద్వారా నిరుపేద ముస్లింల కోసం ఉచిత ఖత్నా నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సద్దాం ఆఫీజ్, షారూఖ్, జిలాన్ రజా, మహబూబ్‌బాషా, షాహుల్, షబ్బీర్ పాల్గొన్నారు.

ఇండియా కూటమితోనే సమన్యాయం

అనంతపురం న్యూటౌన్ : ఇండియా కూటమితోనే అందరికి తగిన న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ నాయకుడు పోతుల నాగరాజు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాప్తాడు నియోజక వర్గ ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను నామినేషన్ వేశానని, అయితే నామినేషన్ విత్‌డ్రా చేసుకొని ఇండియా కూటమి అభ్యర్థి గెలుపు కోసం తమవంతు సహకారం అందిస్తానని తెలిపారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు వాసు, మైనార్టీ నాయకులు శర్మాస్, కిషాస్ సెల్ జిల్లా అధ్యక్షుడు క్రిష్ణా పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 28 : సంప్రదాయ భరత నాట్యం, జానపద నృత్యం, వాయిద్య కళలపై లలితకళా పరిషత్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు పరిషత్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకట సుబ్బయ్య, గాజుల పద్మజ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేసవి సెలవులను పురస్కరించుకుని విద్యార్థుల్లో దాగున్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు మే 1వ తేదీ ఈ శిక్షణా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. సంప్రదాయ నృత్యంలో నాట్యాచార్యుడు విజయ్‌కుమార్, వయొలిన్, కీబోర్డులకు నందకుమార్, పౌరాణిక నాటకాలపై పరిషత్ కళాకారులతో చిన్నారులకు శిక్షణ ఇప్పిస్తామన్నారు. శిక్షణా తరగతుల్లో పాల్గొనదలచినవారు మే 1వ తేదీ లోపు లలితకళా పరిషత్‌లో నేరుగా గాని, 81211 71108, 93909 44502 నెంబర్లను గాని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఫ్యాక్షన్ గ్రామాల్లో కవాతు

శింగనమల : మండలంలోని రెండు ఫ్యాక్షన్ గ్రామాల్లో పోలీసులు ఆదివారం కవాతు నిర్వహించారు. ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్యర్యంలో నాగులగుడ్డం, నాగులగుడ్డం తండలో ఈ కవాతు ఏర్పాటు చేశారు.

ఓటింగ్ శాతాన్ని పెంచడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న కంబదూరు షేక్ నబీరసూల్

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 28: సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచడమే లక్ష్యంగా ఓటర్లకు అవగాహన కల్పించి, చైతన్యం చేస్తున్నామని ఎన్నికల నిఘా వేదిక రీజనల్ కో-ఆర్డినేటర్ కంబదూరు షేక్‌నబీరసూల్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్నికల నిఘావేదిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో ఓటు ప్రాధాన్యత, ప్రాముఖ్యతపై ఓటర్లకు అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మే 1న ఉరవకొండలో భారీ చైతన్యర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సభ్యులు ఓబుళేసు, బాస్కరనాయుడు, మారుతీశర్మ, మురళీధర్, ఎస్ఎం భాషా, విక్టోరియా, శివకుమార్, రామాంజినేయులు, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

టీడీపీకి విశ్వ బ్రాహ్మణుల మద్దతు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 28: విశ్వ బ్రాహ్మణులు టీడీపీకి మద్దతుగా పాతూరు బ్రహ్మంగారి ఆలయ కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి ఆత్మీయసభను నిర్వహించారు. సీనియర్ అడ్వకేట్ గురుప్రసాద్, మాజీ కార్పొరేటర్ రంగాచారి ఆధ్వర్యంలో దీన్ని నిర్వహించారు. కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పని చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఇందులో మాజీ మేయర్ మదమంచి స్వరూప పాల్గొన్నారు.

ఏపీసెట్‌కు 2,542 మంది హాజరు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 28: టీచింగ్ పోస్టుకు అర్హత సాధించడానికి ఆదివారం నిర్వహించిన ఏపీసెట్- 2024 పరీక్షలకు 2542 మంది విద్యార్థులు హాజరయ్యారని రీజనల్ కో-ఆర్డినేటర్ పి.వెంకటరమణ తెలిపారు. ఎస్కేయూలో రెండు, జేఎన్‌టీయూ, అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల, కేఎస్ఎన్, ఎస్ఎస్‌బీఎన్ కళాశాలల్లో ఒకటి చొప్పున పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. మొత్తం 3048మంది అభ్యర్థులకుగాను 2542మంది పరీక్షలు రాశారని మిగిలిన 506 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. వీసీ హుస్సేన్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.



పరీక్షా కేంద్రాన్ని సందర్శిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

సమన్వయంతో కూటమి అభ్యర్థులను గెలిపించండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 28 : టీడీపీ, జనసేన నాయకులు సమన్వయంతో పనిచేసి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, అంబికా లక్ష్మీనారాయణను గెలిపించాలని టీడీపీ అర్బన్ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు లక్ష్మీనారాయణ సూచించారు. ఆదివారం జిల్లాకొచ్చిన ఆయన జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. టీడీపీ, జనసేన మధ్య సమన్వయం లోపం లేకుండా తాను చూసుకుంటానన్నారు. ఈ నేపథ్యంలో విశ్రాంత ఏఎస్పీ రజాక్ జనసేనలో చేరారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్, నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, సీనియర్ నాయకులు కాయగూరల లక్ష్మీప్రసాద్, అడ్వకేట్ ఎంసీ బాలన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మర నాగేంద్ర, జిల్లా కార్యదర్శులు అవుకు విజయ్‌కుమార్, ముప్పూరి కృష్ణ పాల్గొన్నారు.



రిటైర్డ్ ఏఎస్పీ రజాక్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న టీసీ వరుణ్

సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లోకి వెళ్తున్నాయి

● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల



పయ్యావుల కేశవ్‌ను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

ఉరవకొండ, ఏప్రిల్ 28: సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లోకి సూపర్‌స్పీడ్‌తో దూసుకెళ్తున్నాయని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మండలంలోని బూదగవి, నెరమెట్ల, వ్యాసాపురం, రాయంపల్లి, రేణుమాకులపల్లి, నింబగల్లు గ్రామాల్లో ఆదివారం ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బూదగవి గ్రామం రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ వైసీపీ మేనిఫెస్టోపై క్షేత్రస్థాయిలో ఆ పార్టీ కేడర్‌లో నిరాశ నెలకొందన్నారు. వైసీపీ మేనిఫెస్టోతో ఆ పార్టీ గ్రాఫ్ మరింత దిగజారిపోయిందన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రశ్నించిన టీడీపీ నాయకులపై అక్రమకేసులు బనాయించారన్నారు. అరాచకపాలనకు రోజులు దగ్గరపడ్డాయన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో జగన్ వైసీపీ బొమ్మలు వేసుకుని ప్రచారం చేసుకున్నారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో 9 సార్లు నిత్యవసర ధరలు పెరిగాయన్నారు. ఢిల్లీ మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తానని చెప్పి, కేంద్రానికి రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టారని విమర్శించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఏమి అభివృద్ధి చేశారో విశ్వేశ్వరరెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. చేతకాని అసమర్థ నాయకుడిని ఎన్నుకుంటే కష్టాలు తప్పవన్నారు. టీడీపీ హయాంలో 11 చెరువులకు నీళ్లిచ్చామన్నారు. ఈ ఐదేళ్లలో మీటరు కాలువైనా తవ్వారా అని ప్రశ్నించారు. తాగునీటి సమస్యలకు మాజీ ఎమ్మెల్యేనే కారణమన్నారు. మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్, మాజీ ఎంపీపీ కుళ్లాయప్ప, ఏఎంసీ మాజీ చైర్మన్లు దేవినేని పురుషోత్తం, రేగాటి నాగరాజు, నాయకులు చిరంజీవి, వ్యాసాపురం సర్పంచ్ సీతారాములు, శ్రీధర్‌రెడ్డి, వన్నారెడ్డి, నెట్టెంసుధాకర్, సిద్ధప్ప, ప్రహ్లాద, భగవాన్‌దాస్ పాల్గొన్నారు.

టీడీపీ మేనిఫెస్టోపై ప్రచారం

బెళుగుప్ప: టీడీపీ మేనిఫెస్టోపై ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనయుడు విజయసింహ ఆదివారం గంగవరం గ్రామంలో ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి భవిష్యత్తు గ్యారెంటీ గురించి వివరించారు. రెండు గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. సైకిల్ గుర్తుకు ఓటేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వన్నూరుస్వామి, పెద్దతిప్పయ్య, మల్లికార్జున, కంచిరాముడు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న పయ్యావుల జయసింహ

నేడు కాలవ పర్యటన ఇలా...

రాయదుర్గం, ఏప్రిల్ 28: టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు సోమవారం రాయదుర్గం పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. పట్టణంలోని 24వ వార్డులో ఉదయం 8 గంటలకు ప్రచారంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ఓటును అభ్యర్థించనున్నారు.

సొల్లాపురంలో దొంగల హల్‌చల్

● ఒకేరోజు మూడు ఇళ్లలో చోరీ

కణేకల్లు, ఏప్రిల్ 28: మండలంలోని సొల్లాపురం గ్రామంలో దొంగలు హల్‌చల్ చేశారు. శనివారం రాత్రి వరుసగా మూడిళ్లలో చోరీకి పాల్పడ్డారు. బాధితుల వివరాల మేరకు సొల్లాపురం గ్రామంలోని బీసీకాలనీలో నివాసమున్న రామాంజిని ఇంటి మిద్దెపై నిద్రిస్తుండగా దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి రూ.2 లక్షల నగదుతో పాటు మూడు తులాల బంగారాన్ని అపహరించినట్లు తెలిపారు. అదే ఇంటి వరుసలో శివశంకర్ ఇంట్లో రూ.50 వేల నగదు, రెండు తులాల బంగారు అపహరించగా, మరోఇంటికి సంబంధించి మల్లికార్జున వేరే ఊరికి వెళ్లగా ఆ ఇంట్లో రెండు తులాల బంగారం, రూ.25 వేలు నగదును దోచుకెళ్లారు. ఒకే రోజు రాత్రి వరుసగా మూడిళ్లలో దొంగలు చోరీకి పాల్పడడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. బాధిత కుటుంబాలను టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్, ఎస్‌కే మల్లికార్జున, లాలెప్ప, కేశప్ప, కేశవరెడ్డి, మల్లికార్జునరెడ్డి, శేషప్ప, రవీంద్ర పరామర్శించారు.



ఇంట్లోని వస్తువులను చెల్లాచెదురుగా వేసిన దొంగలు

గుర్తుతెలియని యువకుడి మృతి

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 28: పట్టణంలోని నంద్యాలరోడ్డు వద్దనున్న మద్యం దుకాణం ఎదురుగా ఆదివారం గుర్తుతెలియని యువకుడు మృతి చెందాడు. యువకుడు అతిగా మద్యం సేవించి మృతిచెందాడా లేక మరేమైనా కారణాలు ఉన్నాయా అనేది తెలియాల్సి ఉంది. మృతుడు జీన్స్ ప్యాంట్, ఎరుపు రంగు చొక్కా ధరించాడు. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్ఐ గౌస్‌బాషా మృతదేహాన్ని పరిశీలించారు. మృతికిగల కారణాలు తెలియాల్సి ఉందని ఆయన తెలిపారు.



గుర్తుతెలియని యువకుడి మృతదేహం

అరటి తోటల దగ్ధం

బెళుగుప్ప, ఏప్రిల్ 28: మండలంలోని కోనాపురంలో ఆదివారం అగ్ని ప్రమాదంలో రెండు అరటి తోటలు దగ్ధమయ్యాయి. రూ.రెండు లక్షలకుపైగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు భాస్కర్, జయరాములు తెలిపారు. ప్రమాదవశాత్తు జరిగిన ఈ ప్రమాదంలో భాస్కర్‌కు చెందిన ఆరు ఎకరాల అరటితోటలో రూ.లక్ష విలువ చేసే డ్రిప్ పైపులు, పరికరాలు, జయరాములకు చెందిన నాలుగు ఎకరాల తోటలోని డ్రిప్ వైర్లు కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.



కోనాపురంలో దగ్ధమైన అరటితోట

బేకరీలో గ్యాస్ లీక్

కళ్యాణదుర్గం రూరల్ ఏప్రిల్ 28: పట్టణంలోని కొల్లాపురమ్మ గుడి వద్ద బేకరీ షాపులో సిలిండర్ లీకైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు కొల్లాపురమ్మ గుడి ఎదుట బేకరీ షాపు వుంది. నిర్వాహకులు దుకాణం బంద్ చేశారు. షాపులో వున్న గ్యాస్ లీకేజీ అవడంతో ఆ వాసనను గమనించిన చుట్టుపక్కల వారు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది గ్యాస్ స్టవ్, సిలిండర్‌ను బయటకు తీశారు. ఎటువంటి ప్రమాదం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



లీక్ అయిన సిలిండర్‌ను బయటకు తీసిన ఫైర్ సిబ్బంది

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

గుత్తిరూరల్, ఏప్రిల్ 28: మండలంలోని కొత్తపేట గ్రామశివారులోని 67వ జాతీయ రహదారిపై గుండెపోటుతో లారీ డ్రైవర్ మహమద్ రఫీ (54) ఆదివారం మృతి చెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన మహమద్ రఫీ ఐచర్ వాహనంలో లోడు తీసుకొని తాడిపత్రికి మూడు రోజుల క్రితం వచ్చాడు. కుటుంబ సభ్యులు మహమద్ రఫీకి శనివారం నుంచి ఫోన్ చేసినా సమాధానం రాక పోవడంతో ఐచర్‌కు ఉన్న జీపీఎస్ ద్వారా చూసి కొత్తపేట వద్ద ఉన్నట్లు చూపించింది. అక్కడికి వచ్చి చూడగా లారీలో పడుకొని అలాగే చనిపోయాడని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మహమద్ రఫీ గుండెపోటుతో మృతి చెందినట్లు వారు తెలిపారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

చీకటి రాజ్యం నుంచి వెలుగులోకి రావాలి

● రోడ్‌షోలో ఎమ్మెల్యే అభ్యర్థి సురేంద్రబాబు

● వయోవృద్ధుడి ఆశీర్వాదం తీసుకున్న అమిలినేని

కుందుర్పి, ఏప్రిల్ 28: చీకటి రాజ్యం నుంచి ప్రజలు వెలుగులోకి రావాలని టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అన్నారు. మండలంలోని అపిలేపల్లి, జానంపల్లి, యర్రగుంట, అల్లాపురం, బసాపురం, మాయదారులపల్లి, వడ్డీపాల్యం తదితర గ్రామాలలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన రోడ్‌షో నిర్వహించారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన అమిలినేనికి నాయకులు, మహిళలు, గ్రామస్థులు పూలవర్షం కురిపించి గజమాలతో ఘన స్వాగతం పలికారు. సురేంద్రబాబుకు మద్దతుగా వైసీపీ, కాంగ్రెస్ పార్టీలను వీడి 30 కుటుంబాలకు టీడీపీలో చేరాయి. రోడ్‌షో సందర్భంగా గ్రామానికి చెందిన వయోవృద్ధుడు శ్రీరంగప్ప ఎంతో ఉత్సాహంతో వారి వెంట నడుస్తున్న ఆయనను చూసిన అమిలినేని కిందకు దిగి వచ్చి ఆయన పాదాలు మొక్కి ఆశీర్వాదం తీసుకున్నారు. అమిలినేని మాట్లాడుతూ ఇలాంటి చీకటి రాష్ట్రం దేశంలో ఎక్కడాలేదని, ఈ చేతకాని జగన్మోహన్ రెడ్డి పాలనలోనే సాధ్యమైందని, మే 13 నుంచి వెలుగు బాట పట్టడానికి అవకాశం వచ్చిందన్నారు. వలంటీర్లకు కూడా రూ.పది వేలు జీతాలు ఇస్తారని చంద్రబాబునాయుడు ప్రకటించారని, అందుకే కేవలం 60 వేల మంది మాత్రమే రాజీనామా చేశారని గుర్తుచేశారు. అందరికీ అందుబాటులో ఉండి మీకు అండగా వుంటానని భరోసా ఇచ్చారు. ప్రజల కష్టాలను కళ్లారా చూస్తున్నానని, ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి చంద్రబాబు కాళ్లు పట్టుకునైనా నిధులు తీసుకువస్తానని ఏపీఐఐసీ ద్వారా మౌలిక వసతులు కల్పించి ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామన్నారు. కుందుర్పి బ్రాంచ్ కెనాల్ పూర్తిచేసి రైతులను ఆదుకుంటానన్నారు. పవన్‌కళ్యాణ్ కూటమికి ఆద్యుడని, ఆయన కూడా రాష్ట్ర అభివృద్ధికి ముందడుగు వేశారని, రాష్ట్రానికి రాజధాని, అప్పుల భారం నుంచి బయటకు పడాలనే ఎన్డీఏతో జతకట్టాము. గ్రామానికి అవసరమైన విద్యుత్ సబ్ స్టేషన్ అధికారంలోకి వచ్చిన తరువాత, ఏర్పాటుకు చర్యలు చేపడతాం. ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి సమస్య లేకుండా చూస్తాం. ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబుకు మద్దతుగా వైసీపీ ఎంపీటీసీ కవితమ్మ వడ్డే రామాంజనేయులు, కురుబ హనుమంతరాయుడు, ఆనంద్ టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి అమిలినేని సాదరంగా ఆహ్వానించారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 50 వేల మెజార్టీతో టీడీపీ గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మండల కన్వీనర్ ధనుంజయ, మాజీ జడ్పీటీసీ మల్లికార్జున, మాజీ ఎంపీపీ దీనమ్మ, మాజీ మండల కన్వీనర్ కర్తనపర్తి రామాంజనేయులు, యర్రగుంట ఆనంద, శివలింగప్ప, వడ్లప్ప గారి వీరన్న, పెద్ద నరసింహప్ప, మల్లికార్జున, రాఘవేంద్ర, చిత్రలింగప్ప, ప్రసాద్, రామాంజనేయులు, వీరుపాక్షి, రవి, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



సురేంద్రబాబు రోడ్‌షోకు అశేషంగా హాజరైన ప్రజలు

మహాశక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్థిక చేయూత

మహాశక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్థిక చేయూత లభిస్తుందని అమిలినేని కుటుంబ సభ్యులు అన్నారు. మండల పరిధిలోని రుద్రంపల్లి, గురివేపల్లి, ఎనుములదొడ్డి, బోధపల్లి, ఎస్ మల్లాపురం, మల్లాపురం తాండా గ్రామాల్లో అమిలినేని సురేంద్రబాబు సోదరి రాధా మాధవి, కుమార్తె చరిత, కుటుంబ సభ్యులు ఇంటింటికి తిరుగుతూ చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. మే 13న ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఉమ్మడి అభ్యుతలను గెలిపించాలని కోరారు.



వయోవృద్ధుడికి పాదాభివందనం చేస్తున్న సురేంద్రబాబు



ఎంపీటీసీ కవితమ్మకు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న అమిలినేని

హంద్రీనీవా నీటిని చెరువులకు అందిస్తాం

● ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం



రోడ్‌షోలో మాట్లాడుతున్న జయరాం

గుత్తిరూరల్, ఏప్రిల్ 28: నియోజకవర్గంలో వైటీ చెరువు, పాత్తకొత్త చెరువు, గుత్తి చెరువులకు హంద్రీనీవా కాలువల ద్వారా నీరు అందిస్తామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం హామీ ఇచ్చారు. ఆదివారం మండలంలోని శ్రీపురం, మార్నేంపల్లి, పెద్దొడి, చెర్లోపల్లి, రజాపురం గ్రామాలల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లడుతూ చెరువులు నిండితే భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. తాగునీటి సమస్య కూడా తీరుతుందన్నారు. బాచుపల్లిలో గ్రామంలో వైసీపీ నుంచి టీడీపీలోకి 10 కుటుంబలు, శ్రీపురంలో 20 కుటుంబలు, టీ. కొత్తపల్లిలో 30 కుటుంబలకు కండువ వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మండల కన్వీనర్ బర్దివలి, గుమ్మనూరు నారాయణ, సర్పంచ్ భరత్, ఎంపీటీసీలు జింకల నారాయణ స్వామి, ధనుంజయ్య, ఇషాక్, గోవర్ధన్ గౌడ్, సుధీర్ గౌడ్, సాంబ శివ, రవితేజ నారాయణస్వామి, ఏంకే చౌదరి, ప్రతాప్, గోవిందు, లక్ష్మణరావు, వెంకటశివుడు, కాశీరెడ్డి, చంద్ర రంగస్వామి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

గుత్తి: గుత్తిలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని గుమ్మనూరు జయరాం అన్నారు. పట్టణంలోని 9, 10, 11, 12, 13వార్డుల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు తమ దృష్టికి తీసుకువస్తున్నారన్నారు. అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామన్నారు. డాక్టర్ హిమబిందు, సంపత్‌కుమార్, ఎంకే చౌదరి, రవి, సుధాకర్, రామాంజనేయులు, సుధాకర్‌నాయుడు, టైలర్‌బాషా పాల్గొన్నారు.

పలు వార్డుల్లో టీడీపీ ప్రచారం

గుంతకల్లు టౌన్: పట్టణంలోని 12, 28వార్డులలో ఆదివారం టీడీపీ అభ్యర్థి గుమ్మనూరు జయరాం తరఫున ఆయన సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను మహిళలకు వివరించారు. అలాగే డన్‌లప్ ఎ బాషా ఆధ్వర్యంలో చర్చిల్లో ప్రచారం నిర్వహించారు. మండలంలోని దంచర్ల గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. పట్టణంలోని 6, 9వ వార్డులకు చెందిన 200 మంది దళిత యువకులు గుమ్మనూరు నారాయణస్వామి సమక్షంలో టీడీపీలో చేరారు. వార్డు ఇన్‌చార్జిలు బీఎస్ శ్రీధర్, ట్యాంకర్ బెన్హశివశంకర్, ఫజులు, నీలకంఠ కౌన్సిలర్లు, మాజీకౌన్సిలర్లు పాల్గొన్నారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

పామిడి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న బైబిల్ మిషన్ చర్చిలో ఆదివారం టీడీపీ అభ్యర్థుల విజయానికి పాస్టర్ అద్భుత్‌కుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మాజీ మంత్రి, గుంతకల్లు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ టీడీపీ, జనసేన నాయకులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పట్టణంలోని 11, 12వ వార్డులలో ప్రచారం నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ దాసరి లక్ష్మీకాంతమ్మ, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గౌస్‌పీరా, మాజీ కౌన్సిలర్లు శ్యామ్‌రావు, చెన్నవరం మహబూబ్ బాషా, ప్రసాద్ పాల్గొన్నారు.



బైబిల్ మిషన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఈశ్వర్

డ్రిప్ పరికరాలు దగ్ధం

బెళుగుప్ప, ఏప్రిల్ 28: మండలంలోని నక్కలపల్లిలో ఆదివారం అనూష, మీనాక్షమ్మల వ్యవసాయ తోటలో ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో డ్రిప్ పరికరాలు దగ్ధమయ్యాయి. తమ తోటలో శ్రీరంగాపురం పొలంలో ఉన్న అనూష తోటలో రూ.30 వేలు విలువ చేసే డ్రిప్ వైర్లు కాలిపోయాయని, గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతోనే జరిగిందని బాధితరైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 28: మండలంలోని చదంగొల్లలదొడ్డి గ్రామంలో కర్ణాటక మద్యాన్ని అమ్ముతున్న నాగభూషణం అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం గ్రామంలో కర్ణాటక మద్యాన్ని అమ్ముతున్నారన్న సమాచారంతో అతనిపై దాడి చేసి 29 టెట్రాప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థి తరపున ప్రచారం

యల్లనూరు, ఏప్రిల్ 28: మండలకేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ అభ్యర్థి శైలజానాథ్ తరపున ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీచేసి హస్తం గుర్తుకు ఓటువేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఓబులేసు, ప్రహ్లాద్, మస్తాన్ పాల్గొన్నారు.

పుట్లూరు: కాంగ్రెస్‌పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల కన్వీనర్ నారాయణస్వామి అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శైలజానాథ్‌ను గెలిపిస్తే నియోజకవర్గం అభివృద్ధి జరుగుతుందన్నారు. రాంమోహన్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీనా.. బందోబస్తా..?

పామిడి, ఏప్రిల్ 28: పట్టణంలో పోలీసులు అత్యుత్సాహంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఎమ్మెల్యే వెంకటరామరెడ్డి ఆదివారం సాయంత్రం వైసీపీ కార్యాలయానికి వచ్చారు. ఆయనకు బందోబస్తుగా వైసీపీ కార్యాలయం, అమృత హైపర్ మార్టు వద్ద పోలీసులు ఎన్నడూ లేని విధంగా వాహనాల తనిఖీ చేపట్టారు. దీంతో ప్రజలు బందోబస్తా.. వాహనాల తనిఖీనా అంటూ సెటైర్లు వేస్తున్నారు. పరోక్షంగా ఎమ్మెల్యేకు బందోబస్తు నిర్వహించేందుకే పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారని పోలీసుల తీరుపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. దీనిపై పోలీసులను అడుగగా వాహనాల తనిఖీ ఎక్కడైనా చేయవచ్చునని సమాధానమిచ్చారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

అబాకస్ పోటీలకు యాడికి విద్యార్థిని

యాడికి, ఏప్రిల్ 28: అంతర్జాతీయ అబాకస్ పోటీలకు యాడికి వాగ్దేవి హైస్కూల్ విద్యార్థిని హేమశ్రీ ఎంపికైనట్లు కరస్పాండెంట్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. స్టార్ జూనియర్ లెవల్-2లో హేమశ్రీ మొదటి బహుమతి సాధించి అంతర్జాతీయ పోటీలకు ఎంపికైందన్నారు. నిర్వాహకులు హేమశ్రీకి విన్నర్ కప్‌తోపాటు రూ.5వేలు నగదు బహుమతి అందజేశారని తెలిపారు. విద్యార్థినిని అబాకస్ ట్రైనర్ రాధని అభినందించారు.

అభివృద్ధి చేసే పార్టీకి ఓటేయండి

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 28: అభివృద్ధికి పాటుపడే టీడీపీకి ఓటువేసి కూటమి అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డిని గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి కుమారుడు విరాజ్‌రెడ్డి ప్రజలను అభ్యర్థించారు. పట్టణంలోని రజకవీధిలో ఆదివారం ఇంటింటికి తిరిగి ప్రజలను టీడీపీకి ఓట్లు వేయాలని కోరారు. సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రచారంలో కౌన్సిలర్ జింకా లక్ష్మీదేవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న విరాజ్‌రెడ్డి

టీడీపీ ఎంపీ అభ్యర్థిని కలిసిన మండల నాయకులు

పుట్లూరు: టీడీపీ ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణను ఆదివారం మండల నాయకులు అనంతపురంలో కలిశారు. మండల వ్యాప్తంగా కలిసికట్టుగా అందరూ పనిచేయాలని అంబికా సూచించినట్లు తెలిపారు. కలిసిన వారిలో బాలరంగయ్య, ఎల్లుట్ల సతీష్ ఉన్నారు.

10కుటుంబాలు టీడీపీలో చేరిక

పెద్దవడుగూరు: మండలకేంద్రంలో ఆదివారం ఎస్వీ రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 10 కుటుంబాలు టీడీపీలో చేరాయి. పార్టీలో చేరిన బాలకృష్ణారెడ్డి, జయరామిరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, దర్శిరెడ్డి, జయ తదితరులకు రవీంద్రారెడ్డి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. నియోజకవర్గ అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని నమ్మి పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, పుట్లూరు లక్ష్మీకాంత్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, గంగరాజుయాదవ్, నాగేశ్వర్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, రవిప్రకాష్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎస్వీ రవీంద్రారెడ్డి

తల్లికి వందనం పేరుతో పిల్లలకు రూ.15 వేలు

● టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ

బొమ్మనహాళ్, ఏప్రిల్ 28: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే తల్లికి వందనం పేరుతో ఎంతమంది చదివే పిల్లలుంటే వారందరికి ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇస్తామని కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం కురవళ్లి, చంద్రగిరి, సిద్ధరాంపురం, నేమకల్లు, హరేసముద్రం, ఉంతకల్లు గ్రామాలలో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో నిర్వహించారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. గ్రామాలలో కాలవ శ్రీనివాసులుకు అడుగడుగునా నీరాజనాలు పలికారు.



నేమకల్లులో రోడ్‌షో నిర్వహిస్తున్న కాలవ శ్రీనివాసులు

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక: కురువళ్లి, సిద్ధరాంపురం గ్రామాల నుంచి వైసీపీకి చెందిన 50 కుటుంబాలు టీడీపీలోకి కాలవ శ్రీనివాసులు సమక్షంలో చేరారు. మాజీ సర్పంచ్‌లు పెద్దరామన్న, సుదర్శన్‌రెడ్డి, టీడీపీ నాయకులు రామకృష్ణ, ప్రభయ్యస్వామి, వి వన్నూరుస్వామి, విరూపాక్షల వారు టీడీపీలోకి చేరారు. నాగరాజు, బాలచంద్ర, హెచ్ రాము, కె రాము, కే నాగేశ్వరరావు, సురేష్, కావలి సురేష్, కావలి రాము, బసయ్యలతో పాటు మరో 40 కుటుంబాలకు టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

వైసీపీని సాగనంపుదాం

గుమ్మఘట్ట: రాష్ట్రంలో అరాచకపాలన కొనసాగిస్తున్న వైసీపీని వెంటనే సాగనంపుదామని కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం బీటీపీ, కోనాపురం గ్రామాలలో పర్యటించి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు.

సూపర్‌సిక్స్ పథకాలతో మహిళలకు లబ్ధి

కణేకల్లు: సూపర్‌సిక్స్ పథకాలతో మహిళలకు లబ్ధి చేకూరుతుందని ఈ ఎన్నికల్లో టీడీపీ ఓట్లు వేయాలని కాలవ శ్రీనివాసులు కుమార్తె గౌతమి కోరారు. ఆదివారం ఆమె జక్కలవడికి గ్రామంలో ఇంటింటికి తిరిగి విస్తృత ప్రచారం నిర్వహించారు.

సార్.. మా ఊర్లకు తాగునీటి పైపులైన్, రోడ్డు వేయించండి

● కాలవ శ్రీనివాసులుకు విన్నవించిన గ్రామస్థులు

బొమ్మనహాళ్: సార్ ఈ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో మా ఊర్లలో తాగునీటి కష్టాలు ఎక్కువగా ఉన్నాయి. సిద్ధరాంపురం గ్రామానికి రోడ్డు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మీరైనా తాగునీటి పైపులైన్, రోడ్లు వేయించి మా సమస్యలను తీర్చండి అని కురవళ్లి, సిద్ధరాంపురం గ్రామస్థులు కాలవ శ్రీనివాసులును కోరారు. ఈ ఎన్నికల్లో గెలిచిన వెంటనే మీ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



కురవళ్లిలో కాలవ శ్రీనివాసులుకు సమస్యను వివరిస్తున్న మహిళలు

టీడీపీకి ప్రచారం చేశారని విశ్రాంత ఉద్యోగుల ఆఫీసు తొలగిస్తారా?



విశ్రాంత ఉద్యోగులతో మాట్లాడుతున్న గుమ్మనూరు నారాయణస్వామి

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 28: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో ఆదివారం టీడీపీ ప్రచారం నిర్వహించారంటూ ఆ ఆఫీసును తొలగించే యత్నంచేశారు. ఆదివారం కొందరు విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులు తమ కార్యాలయానికి టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామిని ఆహ్వానించారు. కొందరు టపాసులు పేల్చారు. విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా టపాసులు పేల్చారని ఆర్టీసీ డీఎం నారాయణస్వామికి సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న డిపో మేనేజరు ఎక్స్‌కవేటర్‌తో షెడ్‌ను తొలగించేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు అక్కడికి చేరుకున్నారు. టీడీపీ తరఫున ప్రచారం నిమిత్తం వస్తే విశ్రాంత ఉద్యోగుల షెడ్‌ను తొలగిస్తారా? అంటూ టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో కూల్చివేతను ఆర్టీసీ అధికారులు నిలిపివేశారు. దీనిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో డిపో మేనేజరు ఫిర్యాదు చేశారు.

25 ఏళ్ల తరువాత మల్లేశ్వరస్వామి రథోత్సవం

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 28: కంబదూరులో 25 ఏళ్ల తరువాత మల్లేశ్వర స్వామి రథోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం రథోత్సవాన్ని వివిధ రకాల పూలతో అలంకరించి రథాన్ని లాగారు. అడుగడుగునా ఓం నమశ్శివాయః మంత్రంతో మార్మోగాయి. స్థానికులే కాకుండా చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారి సేవలో పాల్గొన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.



రథోత్సవానికి హాజరైన భక్తులు

వైభవంగా జనార్ధన వేంకటేశ్వర స్వామి రథోత్సవం

ఉరవకొండ, ఏప్రిల్ 28: వజ్రకరూరు మండల కేంద్రంలో ఆదివారం జనార్ధన వేంకటేశ్వర స్వామి రథోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, పూజలు చేశారు. ఉదయం స్వామివారికి పల్లకి సేవ, రథ హోమం, రథప్రతిష్ఠాపన, పూర్ణాహుతి కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం సాయంత్ర ఉత్సవమూర్తులను రథంలో అధిష్ఠింపజేశారు. రథం అశేష జనసమూహం మధ్య ముందుకు సాగింది. రథంపైకి భక్తులు అరటి పండ్లు, జామపండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



రథాన్ని లాగుతున్న భక్తులు

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోండి

ఉరవకొండ, ఏప్రిల్ 28: ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆర్వో, జేసీ కేతన్ గార్గ్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఫారం-12 దరఖాస్తును 1వ తేదీ లోగా సమర్పించాలన్నారు. ఈఆర్వో శిరీష, తహసీల్దార్లు పాల్గొన్నారు.